# తొలివెలుగు

TGTEL/26/A6221

TOLE VELUGGU JATIYAPATRIKA

ప్రతి అక్షరం.. ప్రజల పక్షం | జాతీయ పత్రిక

| యాదాద్రి భువనగిరి | సంపుటి: 01 | సంచిక : 05 | ఆదివారం | 2-8-2026 | పేజీలు: 08 | వెల: రూ.2/- |
|---|---|---|---|---|---|---|
| Yadadri Bhuvanagiri | Volume:01 | Issue:05 | Sunday | 2-8-2026 | Pages:08 | Cost:2/- |



విలేకరులు కావలెను

తొలివెలుగు జాతీయ దిన పత్రిక

మన భాష.. మన పత్రిక..

www.epaper.tholivelugu.com

Contacts

తెలంగాణ

94911 34365

ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో

తొలివెలుగు జాతీయ తెలుగు దినపత్రికలో పలు విభాగాల్లో పనిచేయుటకు ఉత్సాహవంతులైన స్టేట్ బ్యూరో, జిల్లా స్టాపర్లు, నియోజకవర్గ ఇన్‌చార్జ్‌లు, మండల రిపోర్టర్లు కావలెను. ఆసక్తి.. అనుభవం గల వారు సంప్రదించగలరు.




## భోగాపురం విమానాశ్రయం

# ఉత్తరాంధ్ర అభివృద్ధికి కొత్త రన్‌వే..

- భోగాపురం ఇంటర్నేషనల్ ఎయిర్ పోర్టు జాతికి అంకితం చేసిన ప్రధాని నరేంద్ర మోడీ
- ఆసియాలో అగ్రగామి ఆర్థిక కేంద్రంగా అభివృద్ధి విశాఖ
- ఉత్తరాంధ్ర అభివృద్ధికి రూ.18 వేల కోట్ల ప్రాజెక్టులను జాతికి అంకితం చేసిన ప్రధానమంత్రి
- స్వర్ణాంధ్ర--వికసిత్ భారత్ లక్ష్యాలకు ఉత్తరాంధ్రలో భారీ అభివృద్ధి ప్రాజెక్టులు ప్రారంభించిన ప్రధాని
- ఉత్తరాంధ్రను ఆసియా ఆర్థిక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు కేంద్రం కట్టుబడి ఉంది: ప్రధానమంత్రి
- మౌలిక సదుపాయాలు, సెమీకండక్టర్లు, గ్రీన్ ఎనర్జీతో ఆంధ్రప్రదేశ్‌కు కొత్త అభివృద్ధి దిశ
- ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి డబుల్ ఇంజిన్ వేగం -- రూ.18 వేల కోట్ల ప్రాజెక్టులకు శ్రీకార
- విమానాశ్రయం నుంచి సెమీకండక్టర్ల వరకు.. ఉత్తరాంధ్ర అభివృద్ధికి కేంద్రం భారీ ముందడుగు

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఉత్తరాంధ్రలో రూ.18 వేల కోట్లకు పైగా విలువైన పలు అభివృద్ధి ప్రాజెక్టులను ప్రారంభించి, జాతికి అంకితం చేయడంతో పాటు కొత్త ప్రాజెక్టులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో ఆయన మాట్లాడుతూ, ఈ కార్యక్రమం స్వర్ణాంధ్ర నిర్మాణం, వికసిత్ భారత్ లక్ష్య సాధనలో ఒక కీలక మైలురాయిగా నిలుస్తుందని పేర్కొన్నారు.ప్రసంగాన్ని ప్రారంభించిన ప్రధానమంత్రి, శ్రీ వరాహ లక్ష్మీ నరసింహ స్వామి, శ్రీ కూర్మనాథ స్వామి, పైడితల్లి అమ్మవారిని స్మరించి నమస్కరించారు.

విశాఖపట్నం: (భోగాపురం) (విజయనగరం) ఆగస్టు1(వజ్రభారతి తెలుగు దినపత్రిక ప్రతినిధి) ఉత్తరాంధ్ర అభివృద్ధి దిశగా ఈ శుభ సందర్భంలో పాల్గొనడం తనకు అదృష్టంగా భావిస్తున్నట్లు తెలిపారు. ఈ రోజు ప్రారంభించిన ప్రాజెక్టుల్లో విమానాశ్రయ అభివృద్ధి, జాతీయ రహదారులు, ఇంధన భద్రత, రవాణా అనుసంధానం వంటి కీలక మౌలిక సదుపాయాల ప్రాజెక్టులు ఉన్నాయని చెప్పారు. ఇవి రాష్ట్ర సమగ్ర అభివృద్ధికి బలమైన పునాదిగా నిలుస్తాయని పేర్కొన్నారు.కార్యక్రమంలో 13 వేలకుపైగా ఆదివాసీ మహిళలు, యువతులు ప్రదర్శించిన

- మిగతా 2వ పేజీలో

## సరికొత్త చరిత్రకు నాంది పలికాం: సీఎం చంద్రబాబు

- ఉత్తరాంధ్రలో సరికొత్త చరిత్ర ప్రారంభమైందన్న సీఎం చంద్రబాబు
- భోగాపురం ఎయిర్‌పోర్టును ఉత్తరాంధ్రకు మణిహారంగా అభివర్ణన
- భూములిచ్చిన రైతులకు పాదాభివందనం చేస్తున్నట్లు వెల్లడి
- అవహేళన చేసిన వారు ఇప్పుడు అడ్రస్ లేకుండా పోయారన్న సీఎం
- రాష్ట్రాన్ని పునర్నిర్మిస్తామన్న మాట నిలబెట్టుకుంటున్నామని స్పష్టీకరణ

## మోదీని విమర్శిస్తుంటే బాధపడ్డా: డిప్యూటీ సీఎం పవన్

- ఉత్తరాంధ్ర అభివృద్ధిలో భోగాపురం ఎయిర్‌పోర్ట్ కీలకమన్న పవన్
- దేశాన్ని మోదీ ప్రగతి పథంలో నడిపిస్తున్నారని ప్రశంస
- చంద్రబాబు మార్గనిర్దేశంలో ఏపీ అగ్రగామి రాష్ట్రంగా మారుతుందని ధీమా
- ప్రధాని మోదీని విమర్శించడం తనను బాధించిందని వ్యాఖ్య

2లో



## వాట్సాప్ అంకుల్స్‌పై ఇన్‌స్టా పిల్లలు గెలిచారు

- వచ్చే ఎన్నికల్లో 50 శాతంపైగా జెన్ జీ ఓటర్లు
- సోషల్ మీడియా వల్లే జవాబుదారీతనం పెరిగిందన్న కేటీఆర్
- నేటి యువతరం రీల్స్ రూపంలో వార్తలు చూస్తోందని వ్యాఖ్య

వచ్చే ఎన్నికల్లో 50 శాతానికి పైగా జెన్–జీ తరం ఓటర్లే కీలక పాత్ర పోషించబోతున్నారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. ఇటీవల నీట్ పరీక్ష వైఫల్యంపై జరిగిన పోరులో 'ఇన్‌స్టా పిల్లలు' విజయం సాధించారని ఆయన వ్యాఖ్యానించారు. శనివారం హైదరాబాద్‌లో జరిగిన ఒక కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, మారుతున్న రాజకీయ సమీకరణాలు, యువతరం ప్రాధాన్యతపై ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు.

- మిగతా 2వ పేజీలో



## ఎర్రబస్సు కూడా రాని భోగాపురానికి ఎయిర్‌బస్సు ఎందుకు? అని జగన్ ఎక్కడా అనలేదు

- టీడీపీ నేతలు కావాలనే విషప్రచారం చేస్తున్నారన్న సజ్జల
- చిన్నారి అడిగిన మాటలనే జగన్ ప్రస్తావించారని వెల్లడి
- విమానాశ్రయం పనులు 80 శాతం వైసీపీ పాలనలోనే పూర్తయ్యాయన్న సజ్జల

భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం విషయంలో అధికార తెలుగుదేశం పార్టీ నేతలు కావాలనే విషప్రచారం చేస్తున్నారని వైసీపీ నేత సజ్జల రామకృష్ణారెడ్డి మండిపడ్డారు. భోగాపురం విమానాశ్రయం అంశంపై వైసీపీని లక్ష్యంగా చేసుకుని తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఘాటుగా స్పందించారు.



## 'పంచ్'లతో పసిడి పంట

- బాక్సింగ్‌లో భారత్‌కు 7 స్వర్ణాలు
- మరో 3 రజతాలతో మొత్తం 10 పతకాలు
- కామన్వెల్త్ క్రీడల్లో భారత్ జోరు

జైస్మీన్, సాక్షి, ప్రీతి, ప్రియ, అరుంధతి, అంకుశ్, సచిన్ స్వర్ణ పతకాలు గెలుచుకోగా...జాదూమణి సింగ్, లవ్లీనా బొర్గొహైన్, నరేందర్ రజతాలు సాధించారు. 2022 కామన్వెల్త్ క్రీడల్లో 3 స్వర్ణాలు, 1 రజతం, 1 కాంస్యంతో 7 పతకాలు గెలుచుకున్న భారత్...ఇప్పుడు దానిని అధిగమించింది. మొత్తంగా శుక్ర, శనివారాలు కలిపి వేర్వేరు ఈవెంట్లలో పెద్ద సంఖ్యలో పతకాలు గెలిచిన భారత్ కామన్వెల్త్ క్రీడల్లో తమ స్థాయిని ప్రదర్శించింది. నేడు పోటీలకు చివరి రోజు.

2లో





## సాగుకి నిల్వలు సరిపోవు

- మరికొన్ని రోజులు ఆగితేనే స్పష్టత వస్తుంది
- తాగునీటికి ఎలాంటి ఇబ్బందులు లేవు
- మంత్రులకు నీటిపారుదల శాఖ ఇంజనీర్ల స్పష్టికరణ
- గోదావరి ప్రాజెక్టులను సందర్శించిన మంత్రులు ఉత్తమ్, శ్రీధర్, వివేక్

గోదావరిఖని: గోదావరి పరీవాహకంలోని శ్రీరాంసాగర్, కడెం, శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టుల కింద ఆయకట్టు పంటలకు సాగునీటి సరఫరాపై ప్రస్తుత పరిస్థితుల్లో ఎలాంటి హామీ ఇవ్వలేమని నీటిపారుదల శాఖ అధికారులు స్పష్టం చేశారు. ఈ ప్రాజెక్టులకు గత కొన్ని రోజులుగా వరదలు ప్రారంభమైనా ప్రస్తుతం ఉన్న నిల్వలు సాగునీటి సరఫరాకు సరిపోవని అభిప్రాయపడ్డారు. జలాశయాలకు నీళ్లు వస్తున్నాయని తొందరపడి పంటలు వేసుకోకుండా ఆయకట్టు రైతులకు అవగాహన కల్పించాలని కోరారు. శనివారం రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మంత్రులు డి.శ్రీధర్ బాబు, జి.వివేక్ వెంకటస్వామితో కలిసి హైదరాబాద్

- మిగతా 2వ పేజీలో

## పశ్చిమాసియాను ఖాళీ చేయండి..

- పౌరులకు అమెరికా హెచ్చరిక
- మధ్యప్రాచ్యంలో కమ్ముకుంటున్న యుద్ధ మేఘాలు
- మరికొన్ని గంటల్లో భీకరదాడులు జరగొచ్చని సంకేతాలు
- ఇరాన్ కీలక సదుపాయాలపై దాడులు జరిగే అవకాశం
- తక్షణమే ఖాళీ చేయాలని పౌరులకు అమెరికా వార్నింగ్

పశ్చిమాసియా మరోసారి ఉద్రిక్తంగా మారే సూచనలు కనిపిస్తున్నాయి. గతంలో కంటే మరింత తీవ్రమైన దాడులు జరగొచ్చని వార్తలు వస్తున్నాయి. ఈ రాత్రికి గానీ.. రేపు రాత్రికి గానీ ఇరాన్‌పై అమెరికా భారీ దాడులు చేయొచ్చని అంతర్జాతీయ మీడియాలో కథనాలు వస్తున్నాయి.

- మిగతా 2వ పేజీలో

## 'నామినేటెడ్'పై కాంగ్రెస్ కసరత్తు

- సమావేశంలో పాల్గొన్న టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్‌గౌడ్
- జిల్లాల వారీగా ఇన్‌చార్జి మంత్రుల సమావేశాలు
- ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు, మహిళలకు ప్రాధాన్యం
- జాబితాలపై సీఎం, పీసీసీ చీఫ్ తుది నిర్ణయం

2లో



## పశ్చిమాసియాను ఖాళీ చేయండి..

(మొదటి పేజీ తరువాయి)

శాంతి ఒప్పందానికి ఇరాన్ ముందుకు రాకపోవడంతో ట్రంప్ తీవ్ర ఆగ్రహంతో ఉన్నట్లుగా తెలుస్తోంది. ఈ నేపథ్యంలో మరోసారి అత్యంత భీకరమైన దాడులు చేసేందుకు అమెరికా సైన్యం సిద్ధపడుతోంది. ఈ నేపథ్యంలో మధ్యప్రాచ్యాన్ని ఖాళీ చేయాలని పౌరులకు అమెరికా ఆదేశించింది. యూఏఈలోని అమెరికా రాయబార కార్యాలయం గంట క్రితమే తమ పౌరులకు ఒక హెచ్చరిక జారీ చేసింది. మధ్యప్రాచ్యంలో పెరుగుతున్న ఉద్రిక్తతల కారణంగా భద్రతా పరిస్థితి సంక్లిష్టంగా ఉందని.. అది అకస్మాత్తుగా తీవ్రరూపం దాల్చవచ్చని పేర్కొంది. ప్రస్తుతం మధ్యప్రాచ్యంలో ఉన్న అమెరికన్లు మరింత జాగ్రత్తగా.. అప్రమత్తంగా ఉండాలని సూచించింది. విమానాల రద్దు.. అప్పుడప్పుడు గగనతల మూసివేత, సంభావ్య ప్రయాణ అంతరాయాలకు కూడా సిద్ధంగా ఉండాలని.. ఈ ప్రాంతంలోని కొన్ని విమానయాన సంస్థలు తమ పాత విమాన సర్వీసులను పునఃప్రారంభించడాన్ని ఆలస్యం చేయగా.. ??మరికొన్ని కొన్ని మార్గాలను రద్దు చేశాయని తెలిపింది. ఈ ప్రాంతంలోని అమెరికన్లు సురక్షిత ప్రాంతాలకు తరలివెళ్లాలని.. పరిస్థితి మరింత దిగజారితే అందుకు సిద్ధంగా ఉండాలని తెలిపింది. జోర్డాన్‌తో సహా ఇతర మధ్యప్రాచ్య దేశాల్లో కూడా ఇలాంటి హెచ్చరికలు జారీ అయ్యాయి. ఈ రాత్రికి లేదా రేపు రాత్రికి ఇరాన్‌పై అమెరికా-ఇజ్రాయెల్ సంయుక్తంగా భారీ దాడులు చేయొచ్చని అంతర్జాతీయ మీడియా కోడైకూస్తోంది. గతంలో కంటే ఎక్కువగా భీకరమైన దాడులు జరగొచ్చని సంకేతాలు వెలువడుతున్నాయి. ఇరాన్ ఇంధన మౌలిక సదుపాయాలే లక్ష్యంగా రెండు దేశాలు దాడులు చేయొచ్చని వర్గాలు చెబుతున్నాయి. సీబీఎస్ వర్గాల సమాచారం ప్రకారం.. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ శుక్రవారం రాత్రి వరకు ఈ దాడులకు తుది ఆమోదం తెలపలేదు. కానీ శుక్రవారమే ఇరాన్‌పై చాలా బలమైన కొత్త దాడి జరగొచ్చని హెచ్చరించారు.

## సాగుకి నిల్వలు సరిపోవు

(మొదటి పేజీ తరువాయి)

నుంచి హెలికాప్టర్‌లో బయలుదేరి వరుసగా శ్రీరామ్‌సాగర్, కడెం, ఎల్లంపల్లి ప్రాజెక్టును, పెద్దపల్లి జిల్లా అంతర్గాం మండలంలోని శ్రీపాదఎల్లంపల్లి ప్రాజెక్టును సందర్శించి నీటి నిల్వలను పరిశీలించారు. మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ సైతం ఎల్లంపల్లి ప్రాజెక్టు సందర్శనలో సహచర మంత్రులతో కలిసి సమీక్షలో పాల్గొన్నారు. ప్రస్తుతం ఉన్న నిల్వలు సాగునీటి సరఫరాకు సరిపోవని, తాగునీటి అవసరాలకు మాత్రం ఇబ్బంది ఉండదని మంత్రులకు ఇంజనీర్లు తెలిపారు. శ్రీరాంసాగర్ ప్రాజెక్టులో ప్రస్తుతం 26 టీఎంసీల నిల్వలుండగా, తాగునీరు, మిషన్ భగీరథ అవసరాలకు 6 టీఎంసీలు అవసరమని ఇంజనీర్లు వివరించారు. గోదావరిపై మహారాష్ట్రలో నిర్మించిన జైక్వాడ్ ప్రాజెక్టు నిండిందని, అక్కడి నుంచి విడుదల చేస్తున్న నీళ్లు మరో వారం రోజుల్లో శ్రీరామ్‌సాగర్‌కు చేరుకోవచ్చని తెలియజేశారు. జైక్వాడ్‌కు దిగువన మహారాష్ట్రలో ఉన్న బాబ్లీ ప్రాజెక్టు గేట్లను జూన్ నుంచి అక్టోబర్ వరకు తెరిచి ఉంచుతారని, దీంతో శ్రీరాంసాగర్‌కు ఆలోగా వరద రావడానికి అవకాశం ఉంటుందని చెప్పారు. ప్రస్తుత పరిస్థితిలో తాగునీటి అత్యధిక ప్రాధాన్యతనివ్వాలని ఇంజనీర్లకు మంత్రి ఉత్తమ్ సూచించారు.ఎల్లంపల్లి ప్రాజెక్టు నుంచి ఇప్పటివరకు 20 టీఎంసీల జలాలను కిందికి విడుదల చేసినట్టు ప్రాజెక్టు ఇంజనీర్లు మంత్రులకు వివరించారు. ఒకవేళ మేడిగడ్డ బరాజ్ నుంచి నీళ్లను అన్నారం, సుందిళ్ల బరాజ్ మీదుగా ఎల్లంపల్లి ప్రాజెక్టులోకి ఎత్తిపోస్తే మళ్లీ ఆ నీళ్లను వృథాగా కిందికి విడుదల చేయాల్సి వచ్చేదని స్పష్టం చేశారు. దీంతో మూడు పంప్‌హౌజ్‌ల నిర్వహణకు వాడిన విద్యుత్ వృథా అయ్యేదని మంత్రి వివేక్ వెంకటస్వామి అన్నారు. అవగాహన లేక కేటీఆర్, హరీశ్‌రావు మేడిగడ్డ నుంచి నీళ్లను ఎత్తిపోయాలని డిమాండ్ చేశారని విమర్శించారు. నిజామాబాద్ జిల్లాలోని శ్రీరాంసాగర్ ప్రాజెక్టులో పేరుకుపోయిన పూడికను తీసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని మంత్రి ఉత్తమ్‌పేర్కొన్నారు. ఇందుకోసం కేంద్రంలోని సాగునీటిరంగ నిపుణులతో చర్చిస్తున్నామన్నారు. ఎగువ ప్రాంతాల్లో వర్షాభావ పరిస్థితులతో ప్రస్తుతం 26 టీఎంసీల నీటికే పరిమితమైందని తెలిపారు.

## వాట్సాప్ అంకుల్స్‌పై ఇన్‌స్టా పిల్లలు గెలిచారు

(మొదటి పేజీ తరువాయి)

"యువతరం సరికొత్త రీతిలో ఢిల్లీలో కదం తొక్కింది. ఎవరితోనైతే ఘర్షణకు వెళ్లకూడదో, ప్రధాని మోదీ సరిగ్గా వారితోనే తలపడ్డారు. ఇటీవల జరిగిన పరిణామాల్లో 'వాట్సాప్ అంకుల్స్'తో సాగిన పోరులో 'ఇన్‌స్టా పిల్లలు' ఎలా పైచేయి సాధించారో దేశం మొత్తం చూసింది" అని కేటీఆర్ వ్యాఖ్యానించారు. ఈ క్రమంలోనే ప్రధాని నరేంద్ర మోదీ సైతం అర్ధరాత్రి సమయంలో ఇన్‌స్టాగ్రామ్‌లో వీడియో పోస్ట్ చేయాల్సిన పరిస్థితి ఏర్పడిందని ఆయన గుర్తుచేశారు. ప్రస్తుత డిజిటల్ యుగంలో సోషల్ మీడియా లేకపోతే పాలకుల్లో జవాబుదారీతనం ఉండేది కాదని కేటీఆర్ అభిప్రాయపడ్డారు. నేటి యువత వార్తాపత్రికలు చదవడం గానీ, టీవీ ఛానెళ్లు చూడటం గానీ తగ్గించారని, 18 నుంచి 24 ఏళ్ల మధ్య వయసున్న వారు వార్తలను సైతం రీల్స్ రూపంలోనే వీక్షిస్తున్నారని ఆయన పేర్కొన్నారు.

## 'పంచ్'లతో పసిడి పంట

(మొదటి పేజీ తరువాయి)

సాక్షి చౌదరి (51 కేజీలు): ఫైనల్లో సాక్షి 5--0తో రూబీ వైట్ (ఇంగ్లండ్)ను ఓడించింది. గత కొంత కాలంగా పలు మార్లు కెరీర్‌లో గాయాలతో ఇబ్బంది పడి కోలుకున్న సాక్షి కెరీర్‌లో ఇది కీలక విజయం. ఆర్థిక సమస్యలు ఎదుర్కొన్న సమయంలో విరాట్ కోహ్లి ఫౌండేషన్ మూడేళ్ల పాటు సాక్షికి అండగా నిలవడంతో ఆమె పట్టుదలగా పోటీలో నిలవగలిగింది. అరుంధతి చౌదరి (70 కేజీలు): ఫైనల్లో అరుంధతి 5--0తో షాంటెల్ రీడ్ (ఇంగ్లండ్)ను ఓడించి పసిడి గెలుచుకుంది. రాజస్తాన్‌కు చెందిన అరుంధతి గత ఏడాది వరల్డ్ బాక్సింగ్ కప్‌లో స్వర్ణం సాధించింది. ప్రియా ఘంఘాస్ (60 కేజీలు): ఫైనల్లో ప్రియ 4--1 తేడాతో మేరీ అల్ అహ్మదీ (కెనడా)పై గెలుపొందింది. సచిన్ సివాచ్ (60 కేజీ): హోరాహోరీగా సాగిన ఫైనల్లో సచిన్ 3--2తో ట్రైగెన్ మార్నింగ్ (నమీబియా)ను ఓడించి స్వర్ణం గెలిచాడు. అతనికి కామన్వెల్త్ పోటీల్లో ఇదే తొలి పతకం కావడం విశేషం. అంకుశ్ పంఘాల్ (80 కేజీలు): ఫైనల్లో అంకుశ్ 4--1 స్కోరుతో దిమెజె షిటు (ఇంగ్లండ్)ను ఓడించి పసిడి గెలిచాడు. భారత లాంగ్ డిస్టెన్స్ రన్నర్ గుల్వీర్ సింగ్ గ్లాస్గో కామన్వెల్త్ క్రీడల్లో 'డబుల్' సాధించాడు. ఈ పోటీల్లో ఇప్పటికే 10,000 మీటర్ల పరుగులో రజతం నెగ్గిన అతను శనివారం 5,000 మీటర్ల పరుగులతో కాంస్యం సొంతం చేసుకున్నాడు. ఈ పరుగును గుల్వీర్ 13 నిమిషాల 24.95 సెకన్లలో పూర్తి చేశాడు. ఒలింపిక్ కాంస్య పతక విజేత లవ్లీనా బొర్గొహైన్‌కు కామన్వెల్త్ క్రీడల్లో స్వర్ణం లభించలేదు. మహిళల 75 కేజీల విభాగంలో ఆమె ఫైనల్లో 1--4తో ఎమా స్యూ గ్రీన్‌ట్రీ (ఆస్ట్రేలియా) చేతిలో ఓడి రజతంతో సంతృప్తి చెందింది. పురుషుల 55 కేజీల కేటగిరీ ఫైనల్లో జాదూమణి సింగ్ 0--5తో జై డిక్సన్ (ఆస్ట్రేలియా) చేతిలో ఓడి రజతాన్ని సొంతం చేసుకున్నాడు.

# భోగాపురం విమానాశ్రయం ఉత్తరాంధ్ర అభివృద్ధికి కొత్త రన్‌వే..

(మొదటి పేజీ తరువాయి)

థింసా నృత్యం ప్రపంచ రికార్డు సృష్టించడం పట్ల ప్రధానమంత్రి అభినందనలు తెలిపారు. ఈ ప్రదర్శన భారత వైవిధ్యానికి, ఆదివాసీ సాంస్కృతిక వారసత్వానికి ప్రతీకగా నిలిచిందని కొనియాడారు.

**అల్లూరి సీతారామరాజు పేరుకు జాతీయ గౌరవం..**
**ఉత్తరాంధ్రకు అభివృద్ధి ఊపు**

మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు త్యాగాలను స్మరించిన ప్రధానమంత్రి, ఆయన పేరును కొత్త విమానాశ్రయానికి పెట్టాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించిందని ప్రకటించారు. ఈ విమానాశ్రయం ఉత్తరాంధ్ర అభివృద్ధికి రన్‌వేగా, యువత భవిష్యత్తుకు లాంచ్‌ప్యాడ్‌గా నిలుస్తుందని పేర్కొన్నారు.

**పేద కుటుంబాలకు విమాన ప్రయాణం**

దేశంలో గత పన్నెండు సంవత్సరాల్లో పౌర విమానయాన రంగం గణనీయంగా అభివృద్ధి చెందిందని ప్రధానమంత్రి తెలిపారు. 2014లో 74 మాత్రమే ఉన్న కార్యకలాపాల విమానాశ్రయాల సంఖ్య ప్రస్తుతం 166కు చేరిందని చెప్పారు. ఉడాన్ పథకం ద్వారా సాధారణ, పేద కుటుంబాలకు కూడా విమాన ప్రయాణం అందుబాటులోకి వచ్చిందని, ఇటీవల ప్రారంభించిన ఉడాన్ రెండో దశ కోసం రూ.29 వేల కోట్ల పెట్టుబడి కేటాయించినట్లు వెల్లడించారు.దేశంలో హబ్-అండ్-స్పోక్ విమానాశ్రయ నమూనాను విస్తరిస్తున్నట్లు పేర్కొంటూ, కాశీలో ప్రారంభించిన ఈ నమూనాను అమృత్‌సర్‌కు కూడా విస్తరించామని తెలిపారు. దీంతో అంతర్జాతీయ అనుసంధానం మరింత బలోపేతం అవుతుందని అన్నారు.

**కోస్టల్ ఎకనామిక్ కారిడార్‌గా అభివృద్ధి చేసే లక్ష్యంతో విశాఖపట్నం నుంచి కృష్ణపట్నం**

ఆంధ్రప్రదేశ్‌ను అభివృద్ధి చెందిన భారతదేశానికి వృద్ధి ఇంజిన్‌గా తీర్చిదిద్దడమే కేంద్ర ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్న ప్రధానమంత్రి, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ నాయకత్వంలోని ఎన్డీఏ ప్రభుత్వం డబుల్ ఇంజిన్ వేగంతో రాష్ట్ర అభివృద్ధికి కృషి చేస్తోందని తెలిపారు.తీర ప్రాంతాన్ని కోస్టల్ ఎకనామిక్ కారిడార్‌గా అభివృద్ధి చేసే లక్ష్యంతో విశాఖపట్నం నుంచి కృష్ణపట్నం వరకు పోర్టుల ఆధునికీకరణ, ములపేట, రామాయపట్నంలో కొత్త పోర్టుల నిర్మాణం చేపట్టినట్లు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా హైవేలు, ఎక్స్‌ప్రెస్‌వేలు, రైల్వే ప్రాజెక్టులు వేగంగా అమలవుతున్నాయని చెప్పారు. పీఎం గతిశక్తి నేషనల్ మాస్టర్ ప్లాన్ ద్వారా రైల్వేలు, పోర్టులు, విమానాశ్రయాలను సమగ్రంగా అనుసంధానం చేసి ఆధునిక లాజిస్టిక్స్ వ్యవస్థను రూపొందిస్తున్నట్లు వివరించారు. ఆంధ్రప్రదేశ్ యువత ప్రపంచవ్యాప్తంగా ఐటీ, సాఫ్ట్‌వేర్ రంగాల్లో తమ ప్రతిభను చాటారని పేర్కొన్న ప్రధానమంత్రి, భవిష్యత్ సాంకేతిక రంగాలైన సెమీకండక్టర్, కృత్రిమ మేధస్సు (ఏఐ), డేటా సెంటర్ల అభివృద్ధిపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించినట్లు తెలిపారు. విశాఖపట్నంలో సెమీకండక్టర్ ప్లాంట్‌కు శంకుస్థాపన చేయడం ఈ దిశలో కీలక అడుగని పేర్కొన్నారు. గూగుల్ 15 బిలియన్ డాలర్ల విలువైన ఏఐ క్లౌడ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ క్యాంపస్‌ను ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించిందని, మరెన్నో అంతర్జాతీయ సంస్థలు రాష్ట్రంలో పెట్టుబడులకు ఆసక్తి చూపుతున్నాయని తెలిపారు. నక్కపల్లిలో భారీ ఫార్మా పార్క్ ఏర్పాటుకు కేంద్ర ప్రభుత్వం సహకరిస్తోందని, దీంతో ఆంధ్రప్రదేశ్ ప్రముఖ ఔషధ తయారీ కేంద్రంగా ఎదుగుతుందని చెప్పారు. గ్రీన్ ఎనర్జీ రంగంలో రాయలసీమలో రూ.5 లక్షల కోట్లకు పైగా పెట్టుబడులు వచ్చినట్లు పేర్కొన్నారు.గత మూడు పర్యటనల్లోనే ఆంధ్రప్రదేశ్‌లో రూ.2 లక్షల కోట్లకు పైగా విలువైన అభివృద్ధి ప్రాజెక్టులను ప్రారంభించినట్లు ప్రధానమంత్రి తెలిపారు. విశాఖపట్నం ఎకనామిక్ రీజియన్‌ను దేశంలోని ప్రముఖ పారిశ్రామిక కేంద్రంగా, ఆసియాలో అగ్రగామి ఆర్థిక కేంద్రంగా అభివృద్ధి చేయడమే లక్ష్యమని పేర్కొన్నారు. "ఇన్వెస్ట్‌మెంట్ టు ఎంప్లాయ్‌మెంట్" అనే మంత్రంతో ప్రభుత్వం ముందుకు సాగుతోందని ప్రధానమంత్రి తెలిపారు. ప్రభుత్వంతో పాటు ప్రైవేట్ రంగ పెట్టుబడులను ప్రోత్సహించడం ద్వారా తయారీ రంగం, ఎగుమతులు, ఉపాధి అవకాశాలు పెరిగి ప్రజల ఆదాయం, జీవన ప్రమాణాలు మెరుగుపడతాయని చెప్పారు.

## మోదీని విమర్శిస్తుంటే బాధపడ్డా: డిప్యూటీ సీఎం పవన్

ఉత్తరాంధ్ర అభివృద్ధిలో భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం ఒక సరికొత్త అధ్యాయాన్ని లిఖించబోతోందని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మార్గదర్శకత్వంలో ఆంధ్రప్రదేశ్ అగ్రగామి రాష్ట్రంగా మారబోతోందని ధీమా వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంపై ప్రశంసలు కురిపించారు. ప్రధాని మోదీ 140 కోట్ల మంది ప్రజల ఆకాంక్షలను నెరవేరుస్తూ దేశాన్ని 'వికసిత్ భారత్' దిశగా వేగంగా నడిపిస్తున్నారని పవన్ కొనియాడారు. ఆయన నాయకత్వంలో దేశం ప్రగతి పథంలో దూసుకుపోతోందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ప్రధాని మోదీ ఎదుర్కొన్న విమర్శలను పవన్ గుర్తుచేసుకున్నారు. గతంలో ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద ప్రధానిని కొందరు విమర్శిస్తున్నప్పుడు తాను చాలా బాధపడ్డానని తెలిపారు. ఎన్ని అవమానాలు ఎదురైనా, వెనక్కి లాగే ప్రయత్నాలు జరిగినా మోదీ ఎక్కడా భయపడలేదని ప్రశంసించారు. మోదీ లాంటి ప్రధాని దేశానికి లభించడం అందరి అదృష్టమని, తనను దూషించిన వారిని కూడా క్షమించే గొప్ప గుణం ఆయనదని పవన్ కళ్యాణ్ చెప్పుకొచ్చారు.

## ఎర్రబస్సు కూడా రాని భోగాపురానికి ఎయిర్‌బస్సు ఎందుకు? అని జగన్ ఎక్కడా అనలేదు: సజ్జల

(మొదటి పేజీ తరువాయి)

వైసీపీ అధినేత జగన్ వ్యాఖ్యలను టీడీపీ నేతలు ఉద్దేశపూర్వకంగా వక్రీకరిస్తున్నారని సజ్జల ధ్వజమెత్తారు. ఎర్రబస్సు కూడా రాని భోగాపురానికి ఎయిర్‌బస్సు ఎందుకు? అని జగన్ ఎక్కడా అనలేదని... ఎయిర్‌పోర్టు పనులు ప్రారంభించే సమయంలో ఓ చిన్నారి అడిగిన మాటలను మాత్రమే జగన్ ప్రస్తావించారని.. దాన్ని అధికార పార్టీ నేతలు తప్పుగా ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. గతంలో చంద్రబాబు కేవలం ఒక నల్లరాయిని తెచ్చి హడావుడిగా శంకుస్థాపన చేసి సరిపెట్టారని సజ్జల విమర్శించారు. వైసీపీ ప్రభుత్వ హయాంలోనే భూసేకరణ, పరిహారం చెల్లింపులు, కీలక అనుమతులన్నింటినీ క్లియర్ చేసి శరవేగంగా పనులు జరిపించామని గుర్తు చేశారు. ఎయిర్‌పోర్టుకు సంబంధించిన 80 శాతం పనులు వైసీపీ పాలనలోనే పూర్తయ్యాయని, మిగిలిన కొద్దిపాటి పనులను మాత్రమే ప్రస్తుత కూటమి ప్రభుత్వం పూర్తి చేసిందన్నారు. కష్టమంతా ఒకరు చేస్తే ఆ క్రెడిట్ మొత్తాన్ని చంద్రబాబు చోరీ చేయడానికి ప్రయత్నిస్తున్నారని... ఏ ప్రభుత్వం అధికారంలో ఉన్నా మిగిలిన పనులను పూర్తి చేయాల్సిందే కదా అని అన్నారు. భోగాపురం విమానాశ్రయం సాకారమవ్వడంలో నాటి జగన్ ప్రభుత్వ కృషి అత్యంత కీలకమైనదని సజ్జల స్పష్టం చేశారు.

## సరికొత్త చరిత్రకు నాంది పలికాం: సీఎం చంద్రబాబు

భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం ఉత్తరాంధ్రకు మణిహారం లాంటిదని, ఈ ప్రాంత దశ, దిశను మార్చే శక్తి దీనికి ఉందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు. విజయనగరం జిల్లా భోగాపురంలో 'అల్లూరి సీతారామరాజు విమానాశ్రయం' ప్రారంభోత్సవ సభలో ఆయన ప్రసంగించారు. ఒకప్పుడు ఈ ప్రాంతానికి ఎర్రబస్సు కూడా రాదంటూ అవహేళన చేసిన వారు ఇప్పుడు అడ్రస్ లేకుండా పోయారని, కానీ నేడు ఇక్కడకు ఎయిర్‌బస్ వచ్చిందని వ్యాఖ్యానించారు. అభివృద్ధికి అడ్డుపడిన శక్తులను ప్రజలు తిరస్కరించారని అన్నారు. ఈ విమానాశ్రయానికి భూములిచ్చిన రైతులు ఉత్తరాంధ్ర కొత్త చరిత్రకు శ్రీకారం చుట్టారని చంద్రబాబు ప్రశంసించారు. "రెండేళ్ల క్రితం విధ్వంసమైన రాష్ట్రాన్ని పునర్ నిర్మిస్తామని ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో నేను, పవన్ కల్యాణ్ హామీ ఇచ్చాం. ఆ హామీని నిలబెట్టుకున్నాం" అని ఆయన తెలిపారు. ఉత్తరాంధ్ర శక్తికి నిదర్శనంగా నిలిచే ఈ విమానాశ్రయానికి స్వాతంత్ర్య సమరయోధుడు అల్లూరి సీతారామరాజు పేరు పెట్టడం గర్వకారణమని అన్నారు. ఉత్తరాంధ్ర వాసి జీఎమ్మార్ ఈ ఎయిర్‌పోర్టును నిర్మించడం, దీనికి తొలి అడుగులు వేసిన అశోక్ గజపతిరాజు, ప్రస్తుత కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు కూడా ఈ ప్రాంతం వారే కావడం విశేషమని గుర్తుచేశారు. ఈ సందర్భంగా రాష్ట్రంలోని కీలక ప్రాజెక్టుల పూర్తిపై చంద్రబాబు స్పష్టత ఇచ్చారు. 2027 నాటికి పోలవరం ప్రాజెక్టును పూర్తి చేసి ప్రధాని చేతుల మీదుగా జాతికి అంకితం చేస్తామని, 2028 నాటికి రాజధాని అమరావతి తొలి దశ పనులను పూర్తి చేసి ప్రారంభిస్తామని ప్రకటించారు. విశాఖ ఉక్కు సెంటిమెంట్‌ను కాపాడింది, రైల్వే జోన్, పోలవరం, అమరావతికి నిధులు ఇచ్చింది ప్రధాని నరేంద్ర మోదీనే అని కొనియాడారు. శంషాబాద్ ఎయిర్‌పోర్టుతో తెలంగాణ దశ మారినట్లే, భోగాపురం ఎయిర్‌పోర్టుతో ఉత్తరాంధ్ర అభివృద్ధి పథంలో దూసుకెళ్తుందని ధీమా వ్యక్తం చేశారు. రానున్న రెండేళ్లలో ప్రధాని సహకారంతో ఉత్తరాంధ్రలో రూ.6.13 లక్షల కోట్ల పెట్టుబడులతో 189 ప్రాజెక్టులు తీసుకొస్తామని, తద్వారా 5.57 లక్షల మందికి ఉద్యోగాలు కల్పిస్తామని చంద్రబాబు హామీ ఇచ్చారు. రూ.2784 కోట్లతో 8 ప్రధాన సాగునీటి ప్రాజెక్టులను మూడేళ్లలో పూర్తి చేస్తామని, 65 ఏళ్లుగా పెండింగులో ఉన్న నేరడి బ్యారేజీకి సైతం అనుమతులు వచ్చాయని తెలిపారు. విశాఖ నుంచి భోగాపురం వరకు బీచ్ కారిడార్ నిర్మించి, టూరిజం, ఫార్మా రంగాలను అభివృద్ధి చేసి ఉత్తరాంధ్ర స్వరూపాన్ని మారుస్తామన్నారు. త్వరలోనే ఇతర ప్రాంతాల నుంచి ఉత్తరాంధ్రకు వలసలు వచ్చే రోజులు వస్తాయని, ప్రభుత్వం కల్పించే అవకాశాలను యువత అందిపుచ్చుకోవాలని పిలుపునిచ్చారు.

# 'నామినేటెడ్'పై కాంగ్రెస్ కసరత్తు

రాష్ట్రంలో నామినేటెడ్ పోస్టుల భర్తీ ప్రక్రియను కాంగ్రెస్ పార్టీ వేగవంతం చేసింది. వ్యవసాయ పరపతి సహకార సంఘాల (పీఏసీఎస్) చైర్మన్లు, డైరెక్టర్లు, వివిధ కార్పొరేషన్ల, జిల్లా, నియోజకవర్గ, రాష్ట్ర స్థాయి నామినేటెడ్ పోస్టుల భర్తీకి అనుసరించాల్సిన విధివిధానాలను ఖరారు చేసింది. ఈ మేరకు శనివారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్‌తో వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ఎంపీ వేం నరేందర్‌రెడ్డి సమావేశమై విస్తృతంగా చర్చించారు. సమావేశంలో నామినేటెడ్ పోస్టుల భర్తీ ప్రక్రియ పూర్తిగా పార్టీ నాయకత్వం నిర్దేశించిన విధానాల ప్రకారమే చేపట్టాలని నిర్ణయించారు. సీఎం రేవంత్‌రెడ్డి, టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ సూచనలకు అనుగుణంగా నియామకాలు చేపట్టాలని స్పష్టం చేశారు. నియామకాల విషయంలో స్థానిక నాయకత్వం అభిప్రాయాలకు ప్రాధాన్యం ఇవ్వడంతో పాటు పార్టీ కోసం కష్టపడి పనిచేసిన నాయకులకు సముచిత గుర్తింపు కలిపంచాలని సమావేశంలో అభిప్రాయపడినట్లు తెలిసింది. ఉమ్మడి జిల్లాలకు నియమించిన ఇన్‌చార్జి మంత్రులు ఆయా జిల్లాల్లో సమావేశాలు నిర్వహించాలని నిర్ణయించారు. ఈ సమావేశాలకు సంబంధిత జిల్లాల మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, డీసీసీ అధ్యక్షులు, ఆయా నియోజకవర్గాల్లో గత ఎన్నికల్లో పోటీ చేసిన పార్టీ అభ్యర్థులు, సీనియర్ నాయకులు హాజరై ఆశావహుల పేర్లపై చర్చించనున్నారు. స్థానిక పరిస్థితులు, పార్టీ బలోపేతానికి చేసిన కృషి, నాయకుల సేవలను పరిగణనలోకి తీసుకుని సమన్వయంతో నివేదిక సిద్ధం చేసి పీసీసీకి పంపాలని నిర్ణయించారు. నామినేటెడ్ పోస్టుల భర్తీలో పార్టీ సంస్థాగత నాయకత్వానికి అధిక ప్రాధా న్యం ఇవ్వాలని గాంధీభవన్‌లో జరిగిన సమావేశం నిర్ణయించింది. మొత్తం పోస్టుల్లో సుమారు 60 శాతం పదవులను గతంలో మండల కాంగ్రెస్ అధ్యక్షులుగా పనిచేసిన నాయకు లు, జిల్లా కాంగ్రెస్ కార్యవర్గ సభ్యులు, అనుబంధ సంఘాల నాయకులు, నియోజకవర్గ స్థాయి సీనియర్ నాయకులకు కేటాయించాలని నిర్ణయించారు. పార్టీ కోసం దీర్ఘకాలంగా పనిచేసిన వారికి గుర్తింపు కలి?పంచడమే ఈ నిర్ణయం ఉద్దేశమని పార్టీ వర్గాలు తెలిపాయి. నియామకాలలో సామాజిక న్యాయం పాటించాలని కూడా సమావేశం నిర్ణయించింది.ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు, మహిళలకు తగిన ప్రాధాన్యం కలి?పస్తూ అన్ని వర్గాలకు సముచిత ప్రాతినిధ్యం ఉండేలా జాబితాలు రూపొందించాలని సూచించారు. సామాజిక సమతుల్యతతో పాటు ప్రాంతీయ సమతుల్యతను కూడా పరిగణనలోకి తీసుకోవాలని నాయకత్వం నిర్ణయించింది.

**సీఎం, పీసీసీ చీఫ్ తుది నిర్ణయం**

జిల్లాల నుంచి వచ్చే నివేదికలను పరిశీలించిన అనంతరం అన్ని సంప్రదింపులు పూర్తి చేసి తుది జాబితాను సిద్ధం చేయనున్నారు. అనంతరం సీఎం రేవంత్‌రెడ్డి, టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ కలిసి తుది నిర్ణయం తీసుకోనున్నారు. దీంతో చాలాకాలంగా ఎదురుచూస్తున్న నామినేటెడ్ పోస్టుల భర్తీ ప్రక్రియ త్వరలోనే పూర్తి కానుందని కాంగ్రెస్ వర్గాలు భావిస్తున్నాయి. ముఖ్యంగా పీఏసీఎస్ చైర్మన్లు, డైరెక్టర్లు, కార్పొరేషన్ చైర్మన్లు, ఇతర నామినేటెడ్ పదవుల నియామకాల కోసం ఎదురుచూస్తున్న పార్టీ నాయకుల్లో ఈ పరిణామం ఆసక్తిని రేకెత్తిస్తోంది.



## యూరియా కొరత లేదు.. రైతులు ఆందోళన చెందొద్దు

- వెలిమినేడు పీఏసీఎస్‌ను తనిఖీ చేసిన డీఏవో వినోద్‌కుమార్
- పెద్దకాపర్తిలో జనపనార సాగు పరిశీలన



**తొలివెలుగు, చిట్యాల:** నల్గొండ జిల్లాలో యూరియాకు ఎలాంటి కొరత లేదని, రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని జిల్లా వ్యవసాయ అధికారి (డీఏవో) వినోద్ కుమార్ స్పష్టం చేశారు. శనివారం ఆయన వెలిమినేడు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాన్ని (పీఏసీఎస్) ఆకస్మికంగా తనిఖీ చేశారు. గోదాముల్లోని ఎరువుల నిల్వలు, రికార్డులను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. చిట్యాల మండలంలోని మూడు పీఏసీఎస్‌లు రైతులకు ఎరువుల పంపిణీలో కీలక పాత్ర పోషిస్తున్నాయని, పంపిణీ నిరంతరాయంగా కొనసాగేలా చూడాలని అధికారులను ఆదేశించారు. ప్రస్తుతం చిట్యాల పీఏసీఎస్‌లో 50 టన్నులు, వెలిమినేడు పీఏసీఎస్‌లో 20 టన్నులు, యమునా ఆగ్రో ఏజెన్సీలో 20 టన్నుల యూరియా అందుబాటులో ఉందని తెలిపారు. అవసరాల మేరకు ఎప్పటికప్పుడు నిల్వలు పెంచుతామన్నారు. అనంతరం పెద్దకాపర్తికి చెందిన రైతు నీలకంఠం కృష్ణయ్య 4 ఎకరాల్లో సాగు చేస్తున్న జనపనార పంటను ఆయన పరిశీలించారు. వరి, పత్తితో పాటు జనపనార వంటి వాణిజ్య పంటల సాగుతో అధిక ఆదాయంతో పాటు నేలసారం పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఎంఏవో పి.గిరిబాబు, ఎంపీవో ఏ.కోటేష్, ఏఈవో శిల్ప, పంచాయతీ కార్యదర్శి కృష్ణయ్య, గోలి మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రత్యామ్నాయ పంటలే మేలు

- వరి సాగుతో నష్టపోవద్దు: ఏవో పద్మజ
- బొందుగులలో రైతుల అవగాహన సదస్సు



**తొలివెలుగు, రాజాపేట:** ఎల్‌నినో ప్రభావంతో తీవ్ర వర్షాభావ పరిస్థితులు నెలకొన్న నేపథ్యంలో రైతులు వరి సాగు చేసి నష్టపోవద్దని మండల వ్యవసాయ శాఖ అధికారిణి (ఏవో) పద్మజ అన్నారు. తక్కువ నీటితో పండే ప్రత్యామ్నాయ పంటలు సాగు చేసుకోవాలని ఆమె కోరారు. గురువారం రాజాపేట మండలం బొందుగుల క్లస్టర్ పరిధిలో రైతులు, గ్రామస్తులకు ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పీఏసీఎస్ చైర్మన్ నమిల మహేందర్ గౌడ్, ఆలేరు మార్కెట్ కమిటీ డైరెక్టర్ సిల్వేరు బాలరాజు గౌడ్ మాట్లాడుతూ.. ప్రస్తుత పరిస్థితుల్లో కందులు, పెసర, మినుము, జొన్న, సజ్జలతో పాటు కూరగాయల సాగు లాభదాయకమన్నారు. జలసంరక్షణలో భాగంగా ప్రతి ఇంటా ఇంకుడు గుంత, పొలాల వద్ద ఊట కుంటలు ఏర్పాటు చేసుకోవాలని, నీటిని వృథా చేయరాదన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచి పయ్యావుల ఎల్లయ్య, ఉప సర్పంచి అబీద్, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్, సొసైటీ డైరెక్టర్లు, రైతులు పాల్గొన్నారు.

## హరిత శోభాయమానంగా మొల్లగూడెం!

- వనమహోత్సవంలో భాగంగా ఇంటింటికీ ఆరు మొక్కల పంపిణీ
- నాటిన ప్రతి మొక్కనూ సంరక్షించాలి: సర్పంచ్ బాలరాజ్ రెడ్డి

**తొలివెలుగు, రాజాపేట:** పర్యావరణ పరిరక్షణతోనే మానవాళికి స్వచ్ఛమైన వాతావరణం, ఆరోగ్యకరమైన భవిష్యత్తు సాధ్యమవుతుందని మొల్లగూడెం సర్పంచ్ జెన్నపల్లి బాలరాజ్ రెడ్డి అన్నారు. యాదాద్రి భువనగిరి జిల్లా రాజాపేట మండలం మొల్లగూడెం గ్రామంలో శనివారం వనమహోత్సవ కార్యక్రమాన్ని గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో ఉత్సాహభరితంగా నిర్వహించారు. ఇందులో భాగంగా గ్రామంలోని ప్రతి ఇంటికీ ఆరు మొక్కల చొప్పున ఉచితంగా పంపిణీ చేశారు.

**ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలి:**

ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ... గ్రామాన్ని హరితమయంగా తీర్చిదిద్దేందుకు ప్రతి కుటుంబం బాధ్యతగా భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. పంచాయతీ తరఫున అందించిన మొక్కలను కేవలం నాటడమే కాకుండా, అవి పెరిగి పెద్దయ్యే వరకు క్రమం తప్పకుండా నీరు పోసి కాపాడే బాధ్యతను ఇంటి సభ్యులు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ రెడ్డబోయిన కవిత, వార్డు సభ్యులు నీల కనకమ్మ, గొడుగు బ్రహ్మయ్య, నీల జహంగీర్, గొడుగు కల్పన, బోయిని నాగరాజు, పంచాయతీ కార్యదర్శి కొండ చక్రధారి, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.



## తల్లిపాలే అమృతం... బిడ్డకు ఆరోగ్యప్రదాత!

- రాజాపేట, పాముకుంటల్లో ఘనంగా 'తల్లిపాల వారోత్సవాలు'
- అవగాహన ర్యాలీని ప్రారంభించిన వైద్యాధికారి డాక్టర్ మోసెస్ రాజ్
- పుట్టిన గంటలోనే ముర్రుపాలు పట్టించాలి: ఉప సర్పంచ్ కేదారి గౌడ్



**తొలివెలుగు, రాజాపేట:** ప్రతి నవజాత శిశువుకు తల్లిపాలు అత్యంత శ్రేష్ఠమైనవని, అవి బిడ్డకు సంపూర్ణ ఆరోగ్యాన్ని అందించడమే కాకుండా రోగ నిరోధక శక్తిని గణనీయంగా పెంచుతాయని రాజపేట ప్రభుత్వ వైద్యాధికారి డాక్టర్ మోసెస్ రాజ్ అన్నారు. శనివారం రాజాపేట మండల కేంద్రంలోని అంగన్వాడీ కేంద్రం (రాజాపేట-1) పరిధిలో 'తల్లిపాల వారోత్సవాల'ను పురస్కరించుకుని ప్రత్యేక అవగాహన ర్యాలీ, సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన గ్రామీణ ఉప సర్పంచ్ నమిల కేదారి గౌడ్ మాట్లాడుతూ... అంగన్వాడీ కేంద్రాల ద్వారా ప్రభుత్వం అందిస్తున్న పోషకాహార సేవలను గర్భిణులు, బాలింతలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కాన్పు అయిన గంట వ్యవధిలోనే బిడ్డకు ముర్రుపాలు పట్టించాలని, కాన్పులన్నీ ప్రభుత్వ ఆసుపత్రుల్లోనే జరిగేలా చూసుకోవాలన్నారు. గర్భవతిగా ఉన్నప్పుడే సరైన పోషకాహారం తీసుకుంటే ఆరోగ్యవంతమైన శిశువు జన్మిస్తుందని తెలిపారు. అంగన్వాడీ సూపర్వైజర్ రమణకుమారి మాట్లాడుతూ తల్లి పాల ప్రాముఖ్యతను వివరించారు. అనంతరం మండల పరిధిలోని పాముకుంట అంగన్వాడీ కేంద్రంలో సర్పంచ్ రంగా నరేష్ గౌడ్ అధ్యక్షతన తల్లిపాల వారోత్సవాలు జరిగాయి. ఈ సందర్భంగా తల్లిపాలలో ఉండే పోషకాలపై బాలింతలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమాల్లో పంచాయతీ కార్యదర్శి నారెడ్డి రాజమహేందర్ రెడ్డి, పాముకుంట కార్యదర్శి మమత, హెచ్ఈఓ బీకు నాయక్, ఏఎన్ఎంలు సులోచన, అనిత, క్రిష్ణనీల, అంగన్వాడీ టీచర్లు భాగ్యలక్ష్మి, భారతి, చంద్రకళ, పార్వతి, శాంత, కళ్యాణి, ఆశా కార్యకర్తలు రాణి, భాగ్యలక్ష్మి, భార్గవి, బాలింతలు, గర్భిణులు పాల్గొన్నారు.

## 'హరిత చల్లూరు'గా తీర్చిదిద్దుదాం



- గ్రామంలో ఇంటింటికీ మూడు మొక్కల పంపిణీ
- నాటిన ప్రతి మొక్కను సంరక్షించాలి: సర్పంచ్ రూప బాల నర్సయ్య గౌడ్
- పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత

**తొలివెలుగు, రాజాపేట:** పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని, చల్లూరు గ్రామాన్ని హరిత గ్రామంగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సర్పంచ్ భీమగాని రూప బాల నర్సయ్య గౌడ్ కోరారు. రాజాపేట మండలం చల్లూరు గ్రామంలో పచ్చదనాన్ని పెంపొందించాలనే లక్ష్యంతో గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో శనివారం ఇంటింటికీ మొక్కల పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టారు.

**భావితరాలకు స్వచ్ఛమైన వాతావరణం:**

ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. ప్రతి కుటుంబానికి ఉచితంగా మూడు మొక్కలను అందజేశామని, వాటిని ఇంటి ఆవరణలో నాటి కంటికి రెప్పలా కాపాడుకోవాలని సూచించారు. కనీసం ఏడాదికి ఒక మొక్క నాటినా పర్యావరణంలో గొప్ప మార్పు వస్తుందన్నారు. ప్రతి ఇంటి వద్ద మొక్కలు పెంచడం ద్వారా గ్రామం మరింత ఆహ్లాదకరంగా, పచ్చదనంతో కళకళలాడుతుందని తెలిపారు. మొక్కలు పెంచడం ద్వారా భావితరాలకు స్వచ్ఛమైన గాలి, ఆరోగ్యకరమైన వాతావరణం అందించవచ్చని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ బొంత సుధాకర్, మాజీ సర్పంచ్ మహేశ్వరం మల్లేష్, గ్రామ ప్రముఖులు ఆరుకల గాలిరెడ్డి, గ్రామపంచాయతీ కార్యదర్శి గండికోట మహేష్, వార్డు సభ్యులు, పంచాయతీ సిబ్బంది, మహిళలు, యువకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## రవీంద్రారెడ్డి సేవలు మరువలేనివి

- సొంత నిధులతో బడుల అభివృద్ధి.. విద్యార్థుల సంక్షేమానికి పెద్దపీట
- ఘనంగా సింగారం గెజిటెడ్ హెచ్ఎం పదవీ విరమణ సన్మానం
- కొనియాడిన మాజీ విప్ పాదూరి, ఎంఈవో చందా రమేష్



**తొలివెలుగు, రాజాపేట:** ఉద్యోగ విరమణ పొందిన సింగారం ఉన్నత పాఠశాల గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు లెక్కల రవీంద్రారెడ్డి సేవలు ఎంతో స్ఫూర్తిదాయకమని మాజీ శాసన మండలి ప్రభుత్వ విప్, ఉపాధ్యాయ ఉద్యమ నాయకుడు పాదూరి సుధాకర్ రెడ్డి కొనియాడారు. రాజాపేటలోని ఎన్.కె. ఫంక్షన్ హాల్‌లో ఉపాధ్యాయురాలు సి.హెచ్. సుప్రియ అధ్యక్షతన శనివారం రవీంద్రారెడ్డి పదవీ విరమణ సన్మాన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సభకు సుధాకర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. రవీంద్రారెడ్డి ఏ పాఠశాలలో పనిచేసినా విద్యార్థుల విద్యాభివృద్ధికే కాకుండా, తన సొంత ఖర్చులతో అనేక మౌలిక వసతులు కల్పించి ఉదార స్వభావాన్ని చాటుకున్నారని ప్రశంసించారు. ఉపాధ్యాయుడి సన్మాన సభకు గ్రామస్తులు అధిక సంఖ్యలో తరలిరావడం సంతోషకరం అన్నారు.

**రెట్టింపైన విద్యార్థుల సంఖ్య:**

మండల విద్యాధికారి (ఎంఈవో) చందా రమేష్ మాట్లాడుతూ.. గత 25 నెలల్లో సింగారం పాఠశాల అభివృద్ధికి రవీంద్రారెడ్డి విశేష కృషి చేశారని, విద్యార్థుల సంఖ్యను రెట్టింపు చేయడంలో ఆయన పాత్ర అభినందనీయమని పేర్కొన్నారు. గ్రామ సర్పంచ్ ప్రమీలా పందరి మాట్లాడుతూ.. తమ గ్రామంలోని పాఠశాలను ఆయన ఎంతో అభివృద్ధి చేశారని కృతజ్ఞతలు తెలిపారు. సన్మాన సభకు ముందు పాఠశాలలో సుమారు రూ. 30 వేల విలువైన స్కూల్ బ్యాగులను విద్యార్థులందరికీ రవీంద్రారెడ్డి ఉచితంగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. సభలో ప్రధానోపాధ్యాయులు కె. మనోజ్ కుమార్, టి. రాజు, బి. వసంత, ఎస్. విజయలక్ష్మి, కిరణ్మయి, జె. ప్రభాకర్, జి. కోటిరెడ్డి, బి. రమేష్, ఎం. శ్రీనివాస్, పీఆర్టీయూ నాయకులు కె. అమరేందర్ రెడ్డి, ఎస్. సుబ్బరాజు, జి. బాలరాజు, టీపీయూఎస్ నేత డి. జానయ్య, టీపీటీఎఫ్ నేత వీరభద్రం, డీటీఎఫ్ నేత నాగరాజు, మండల ఉపాధ్యాయులు, గ్రామస్తులు, బంధుమిత్రులు పాల్గొని రవీంద్రారెడ్డిని శాలువాలతో ఘనంగా సత్కరించారు.

## ఆందోళ్ మైసమ్మకు పండుగలా 'గంగ బోనం'

- దండు మల్కాపురంలో ఘనంగా 21వ బోనాల మహోత్సవం
- అమ్మవారికి 'గంగ బోనం' సమర్పించిన ముదిరాజ్‌లు



**తొలివెలుగు, చౌటుప్పల్:** దండు మల్కాపురం గ్రామంలో కొలువై ఉన్న శ్రీ ఆందోల్ మైసమ్మ 21వ బోనాల మహోత్సవాలను శనివారం భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈ ఉత్సవాల సందర్భంగా గ్రామ ముదిరాజ్ కులస్తులు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి, సంప్రదాయబద్ధంగా 'గంగ బోనం' సమర్పించి తమ మొక్కులు చెల్లించుకున్నారు. గ్రామస్తులంతా ఆనందోత్సాహాలతో ఈ వేడుకల్లో పాల్గొని అమ్మవారి ఆశీస్సులు పొందారు. ఈ ఆధ్యాత్మిక కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు సోప్పరి మల్లేష్, ప్రధాన కార్యదర్శి దేప శ్యాంసుందర్ ముదిరాజ్, ఉపాధ్యక్షుడు గుండ్ల అనిల్, డైరెక్టర్లు పెరుమాండ్ల మహేష్, బండారు లింగస్వామి, దేప రాజీవ, గుండ్ల చంద్రశేఖర్ పాల్గొన్నారు. అలాగే సంఘ సభ్యులు గుండ్ల మహేష్, బండారు మల్లేష్, బండారు రఘుపతి, గుండ్ల నరసింహ, దేప మహేష్, బండారు నరసింహ, గుండ్ల జంగయ్య, బండారు పోన్నయ్య, గుండ్ల అశోక్, దేప మల్లేష్, పెరుమాండ్ల సురేష్, గుండ్ల లింగస్వామి, సొప్పరి గణేష్, సత్య బోయిన మల్లేష్, సొప్పరి శివ, నూకల మహేష్, బడే రాజు, అప్పిస్ బాణు, దేప అరుణ్ తదితరులతో పాటు అధిక సంఖ్యలో మహిళలు, భక్తులు పాల్గొన్నారు.

# సోమారంలో అంగన్‌వాడీ టీచర్ పోస్టు ఖాళీ

- అర్హులైన మహిళల నుంచి దరఖాస్తుల ఆహ్వానం
- వివరాలు వెల్లడించిన ఎంపీడీఓ నాగవేణి
- ఇంటర్ అర్హత.. ఓసీకి కేటాయింపు

**తొలివెలుగు, రాజాపేట:** రాజాపేట మండల పరిధిలోని సోమవారం గ్రామంలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రం-2లో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ టీచర్ పోస్టు భర్తీకి అర్హులైన మహిళా అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఎంపీడీఓ నాగవేణి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.

**అర్హతల వివరాలు:**

- **విద్యార్హత:** గుర్తింపు పొందిన బోర్డు నుంచి ఇంటర్మీడియట్ ఉత్తీర్ణత సాధించి ఉండాలి.
- **వయోపరిమితి:** 18 నుంచి 30 సంవత్సరాల మధ్య వయస్సు కలిగి ఉండాలి.
- స్థానికత రిజర్వేషన్: దరఖాస్తుదారులు తప్పనిసరిగా సోమవారం గ్రామానికి చెందిన స్థానిక నివాసి అయి ఉండాలని, ఈ పోస్టు ఓసీ (ఓపెన్ కేటగిరీ) కింద రిజర్వ్ అయి ఉందని వివరించారు. అర్హత, ఆసక్తి ఉన్న అభ్యర్థులు వెంటనే తమ విద్యార్హత, స్థానికత ధ్రువీకరణ పత్రాలతో దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీఓ కోరారు.

# ప్రభుత్వ శాఖల్లో 'ఫేస్ యాప్' హాజరు ప్రారంభం

- కలెక్టర్ ఆదేశాలతో రాజాపేట మండలంలో అమలులోకి విధానం
- 'మీ ప్రమాణం' యాప్ ద్వారానే ఉదయం, సాయంత్రం అటెండెన్స్
- సమయపాలనపై ఆంక్షలు.. ప్రజా సేవలు వేగవంతం



**తొలివెలుగు, రాజాపేట:** ప్రభుత్వ కార్యాలయాల్లో ఉద్యోగుల హాజరులో పారదర్శకత, సమయపాలన తెచ్చేందుకు ఉద్దేశించిన 'ఫేస్ యాప్' హాజరు విధానం రాజాపేట మండలంలోని అన్ని ప్రభుత్వ శాఖలలో శనివారం నుంచి అధికారికంగా ప్రారంభమైంది. గత సోమవారం జిల్లా కలెక్టర్ ఇచ్చిన ఉత్తర్వులకు అనుగుణంగా మండల స్థాయి ఉద్యోగులందరికీ ఈ నూతన విధానాన్ని అందుబాటులోకి తీసుకువచ్చారు.

**కార్యాలయ ప్రాంగణంలోనే పనిచేసేలా పరిమితి:**

'మీ ప్రమాణం' పేరిట రూపొందించిన ఈ ఫేస్ రికగ్నిషన్ యాప్ కోసం మండలంలోని వివిధ శాఖల ఉద్యోగులను సమన్వయం చేస్తూ ప్రత్యేక గ్రూపును ఏర్పాటు చేశారు. ఉద్యోగులు తమ సొంత మొబైల్ ఫోన్లలోనే ఈ యాప్ ద్వారా హాజరు నమోదు చేసుకోవాల్సి ఉంటుంది. ఈ యాప్ కేవలం సంబంధిత ప్రభుత్వ కార్యాలయ ప్రాంగణంలో (జీయో-ఫెన్సింగ్) ఉన్నప్పుడు మాత్రమే పనిచేస్తుంది. ఉదయం విధులకు వచ్చేటప్పుడు, సాయంత్రం సమయం ముగిసి తిరిగి వెళ్లేటప్పుడు రెండుసార్లు ఫేస్ అటెండెన్స్ వేయడం తప్పనిసరి చేశారు. దీనివల్ల ఉద్యోగులు సమయానికి కార్యాలయాలకు రావడం, పూర్తి సమయం అందుబాటులో ఉండటం సాధ్యమవుతుందని ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. అయితే కొన్ని సాంకేతిక లోటుపాట్లను అధిగమించాలని పలువురు కోరుతున్నారు.

# బాధిత కుటుంబానికి 'జైశ్రీరామ్ ఫౌండేషన్' ఆర్థిక సాయం అందజేత

- దండే నవీన్ కుటుంబానికి రూ. 5 వేల అందజేత
- పాల్గొన్న రాజాపేట సర్పంచ్ కోయ మధు



**తొలివెలుగు, రాజాపేట:** రాజాపేట గ్రామానికి చెందిన దండే నవీన్ ఇటీవల మృతి చెందగా, ఆ విషాదంలో ఉన్న ఆయన కుటుంబాన్ని ఆదుకునేందుకు 'జైశ్రీరామ్ ఫౌండేషన్' ముందుకొచ్చింది. శనివారం ఫౌండేషన్ సభ్యులు నవీన్ నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. తక్షణ ఖర్చుల నిమిత్తం ఫౌండేషన్ ఆధ్వర్యంలో రూ. 5,000 నగదును ఆర్థిక సాయంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న రాజాపేట సర్పంచ్ కోయ మధు మాట్లాడుతూ.. ఆపదలో ఉన్న పేద కుటుంబాలకు స్వచ్ఛంద సంస్థలు అండగా నిలవడం ఎంతో అభినందనీయమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో గండ్ల నర్సింగరావు, చెలమనపల్లి లక్ష్మన్, చిగుళ్ల బిరయ్య, సాధనబోయిన శంకర్, సఖినాల చిరంజీవి, సంగం వేణు, బిర్రు శ్రీహరి, కాకళ్ల సిద్దులు, నగరం పుల్లయ్య, సీతాలు, దప్పు రాజు, మృతుడి కుటుంబ సభ్యులు, ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.

# గుండంరాజుపల్లిలో బీఆర్ఎస్ నాయకుల మానవత్వం

- మృతి చెందిన మెడ ఉప్పలయ్య కుటుంబానికి నిత్యవసరాల సాయం
- 50 కిలోల బియ్యం, 5 లీటర్ల వంట నూనె అందజేత

**తొలివెలుగు, చిన్నగూడూరు:** మహబూబాబాద్ జిల్లా చిన్నగూడూరు మండలం గుండంరాజుపల్లి గ్రామంలో ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన మెడ ఉప్పలయ్య కుటుంబాన్ని గ్రామ బీఆర్ఎస్ పార్టీ నాయకులు ఆదుకున్నారు. కుటుంబానికి పెద్ద దిక్కును కోల్పోయి రోడ్డున పడిన ఆ కుటుంబానికి అండగా నిలవాలనే ఉద్దేశంతో శనివారం వారు మానవత్వం చాటుకున్నారు. బాధిత కుటుంబానికి 50 కిలోల బియ్యం, 5 లీటర్ల వంట నూనెను అందజేశారు. ఈ కష్టకాలంలో ఆ కుటుంబానికి ధైర్యం చెబుతూ తామంతా అండగా ఉంటామని భరోసా కల్పించారు. గ్రామంలోని ఇతర పెద్దలు, గ్రామస్తులు కూడా ఆ కుటుంబానికి తగిన సహాయ సహకారాలు అందించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ చెక్కల శ్రీను మమత, బీఆర్ఎస్ నాయకులు మూల శ్రీను, అశోక్, విజయ్, శంకర్, వీరన్న, ఉప్పలయ్య, శ్రీశైలం, యకన్న తదితరులు పాల్గొన్నారు.



# కాచం కృష్ణమూర్తి స్ఫూర్తితో భూ పోరాటాలను ఉధృతం చేద్దాం

- యువత ఉద్యమాలకు సిద్ధం కావాలి..
- ప్రభుత్వ భూములను పేదలకు పంపిణీ చేయాలి: సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు ఎస్. వీరయ్య



**తొలివెలుగు, వలిగొండ:** కామ్రేడ్ కాచం కృష్ణమూర్తి స్ఫూర్తితో భూ పోరాటాలను మరింత ఉధృతం చేయాలని సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు ఎస్. వీరయ్య పిలుపునిచ్చారు. శనివారం వలిగొండలోని సీపీఎం మండల కార్యాలయంలో కొండే కిష్టయ్య అధ్యక్షతన నిర్వహించిన మండల కమిటీ సమావేశంలో కాచం కృష్ణమూర్తి 20వ వర్ధంతిని పురస్కరించుకుని నివాళు లర్పించారు. ఈ సందర్భంగా వీరయ్య మాట్లాడుతూ.. తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంలో వందల గ్రామాల్లో వేలాది మంది పేదలకు ప్రభుత్వ బంజరాయి, పోరంబోకు, చెరువు శిఖం భూములను భూస్వాముల ఆధీనంలో నుంచి స్వాధీనం చేసి ప్రజలకు పంపిణీ చేయడంలో కాచం కృష్ణమూర్తి విశేష పాత్ర పోషించారని కొనియాడారు. ఆయన ఆశయాలను కొనసాగిస్తూ భూమిలేని నిరుపేదలకు ప్రభుత్వ భూములను పంపిణీ చేయడం, ఇళ్ల స్థలాలు లేని వారికి స్థలాలు, గృహాలు సాధించే దిశగా ఉద్యమాలను చేపట్టాల్సిన అవసరం ఉందన్నారు. భారతదేశం ప్రపంచంలోనే అత్యధిక యువశక్తి కలిగిన దేశమైనప్పటికీ, ఆ శక్తిని దేశాభివృద్ధికి వినియోగించుకోవడంలో పాలకులు విఫలమయ్యారని ఆయన విమర్శించారు. నిరుద్యోగ సమస్యతో యువత భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారిందని, ఉపాధి అవకాశాలు కల్పించడం ప్రభుత్వాల బాధ్యత అని పేర్కొన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ శాఖల్లో లక్షలాది ఉద్యోగాలు ఖాళీగా ఉన్నప్పటికీ వాటిని భర్తీ చేయడంలో నిర్లక్ష్యం చూపుతున్నారని అన్నారు. ఉద్యోగాల కోసం ప్రశ్నించే యువతను దేశద్రోహులుగా ముద్ర వేయాలనే ప్రయత్నాలు ప్రజాస్వామ్యానికి విరుద్ధమని విమర్శించారు. ప్రభుత్వాల ప్రజావ్యతిరేక విధానాలపై యువత మరింత చైతన్యంతో ఉద్యమాల్లో పాల్గొనాలని పిలుపునిచ్చారు. అనంతరం సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు ఎండి జహంగీర్ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం కొత్త పెన్షన్లను వెంటనే మంజూరు చేసి, లబ్ధిదారుల ఎంపికను గ్రామసభల ద్వారా పారదర్శకంగా నిర్వహించాలని డిమాండ్ చేశారు. ఇందిరమ్మ ఇళ్ల మొదటి విడత లబ్ధిదారులకు పెండింగ్‌లో ఉన్న బిల్లులను వెంటనే చెల్లించాలని, రెండో విడత లబ్ధిదారులను గుర్తించి గృహ నిర్మాణ పనులను ప్రారంభించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు మాటూరి బాలరాజు, మండల కార్యదర్శి సిర్పంగి స్వామి, జిల్లా కమిటీ సభ్యులు గణపతి రెడ్డి, పీఎన్ఎం జిల్లా కార్యదర్శి ఈర్లపల్లి ముత్యాలు, మండల కార్యదర్శివర్గ సభ్యులు తుర్కపల్లి సురేందర్, మెరుగు వెంకటేశం, కందడి సత్తిరెడ్డి, వాకిటి వెంకటరెడ్డి, మండల కమిటీ సభ్యులు గాజుల ఆంజనేయులు, చీరక శ్రీశైలం రెడ్డి, కలుకూరి ముత్యాలు, కర్ణకంటి యాదయ్య, కవిడే సురేష్, దుబ్బ లింగం, బూడిద మనమ్మతో పాటు ప్రజా సంఘాల నాయకులు వేముల నాగరాజు, ఉండాటి పాపయ్య తదితరులు పాల్గొన్నారు.

# మృతుడి కుటుంబానికి ఆర్థిక చేయూత





- రూ.8 వేల ఆర్థిక సహాయం అందజేసిన కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు వాకిటి అనంతరెడ్డి

**తొలివెలుగు, వలిగొండ:** వలిగొండ మండలంలోని ఆరూర్ గ్రామానికి చెందిన మర్రి నరసింహ అనారోగ్యంతో మృతి చెందడంతో ఆయన కుటుంబ సభ్యులను డీసీసీ మాజీ ఉపాధ్యక్షుడు, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు వాకిటి అనంతరెడ్డి శనివారం పరామర్శించారు. ఈ సందర్భంగా మృతుడి కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేసిన అనంతరెడ్డి, కుటుంబానికి రూ. 5,000 ఆర్థిక సహాయాన్ని అందజేశారు. అలాగే గ్రామ 3వ వార్డు సభ్యుడు కసిరబోయిన మత్స్యగిరి యాదవ్ ఆధ్వర్యంలో మరో రూ. 3,000 ఆర్థిక సహాయాన్ని కుటుంబానికి అందించారు. బాధిత కుటుంబానికి అండగా ఉంటామని, ఈ క్లిష్ట సమయంలో ధైర్యంగా ఉండాలని వారు సూచించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, యాదవ సంఘం మాజీ అధ్యక్షుడు ఆవుల స్వామి, మత్స్యగిరి లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం ధర్మకర్త దామెర అంజయ్య, రేఖ మత్స్యగిరి, గొడ్డేటి మల్లేష్, మర్రి అంజయ్య, కసిరబోయిన మహేష్ తదితరులు పాల్గొని మృతుడి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

# బస్సు ఎక్కుతున్న ప్రయాణికులే టార్గెట్.. ముగ్గురు జేబు దొంగల అరెస్ట్

- నిందితుల నుంచి ఐఫోన్, మోటరోలా ఫోన్ స్వాధీనం
- ప్రధాన నిందితుడిపై గతంలోనూ 7 చోరీ కేసులు
- రిమాండ్‌కు తరలించిన నాగోల్ పోలీసులు

**తొలివెలుగు, నాగోల్:** బస్సు ఎక్కే ప్రయాణికుల రద్దడిని ఆసరాగా చేసుకుని సెల్‌ఫోన్లు అపహరిస్తున్న ముగ్గురు అలవాటు నేరస్తులను నాగోల్ పోలీసులు అరెస్ట్ చేశారు. వారి నుంచి విలువైన ఐఫోన్‌తో పాటు మరో మోటరోలా సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించారు. పోలీసులు వెల్లడించిన వివరాల ప్రకారం.. జూలై 31న నాగోల్ చౌరస్తాలోని బస్‌స్టాండ్‌లో బస్సు కోసం వేచి ఉన్న ప్రయాణికులు నారాయణ రాజ్‌కుమార్, వెంకటాచారి బస్సు ఎక్కుతున్న సమయంలో ముగ్గురు నిందితులు పథకం ప్రకారం వ్యవహరించారు. నిందితుల్లో ఒకరైన కావడి శివ (22) వారిని మాటల్లో పెట్టి దృష్టి మరల్చగా.. అతనితో పాటు ఉన్న మేకల జగపతి బాబు అలియాస్ జగపతి, బోయ అలియాస్ గారడీ మంజునాథ్ అలియాస్ మంజు బాధితుల జేబుల్లోని రెండు సెల్‌ఫోన్లను చాకచక్యంగా అపహరించి పరారయ్యారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన నాగోల్ పోలీసులు.. ఆగస్టు 1న నాగోల్ చౌరస్తా వద్ద అనుమానాస్పదంగా సంచరిస్తున్న ముగ్గురిని అదుపులోకి తీసుకుని విచారించగా నేరాన్ని ఒప్పుకున్నారు. విచారణలో భాగంగా ప్రధాన నిందితుడు మేకల జగపతి బాబుపై వివిధ పోలీస్‌స్టేషన్లలో ఏడు సెల్‌ఫోన్ చోరీ కేసులు, బోయ అలియాస్ గారడీ మంజునాథ్‌పై నాలుగు చోరీ కేసులు ఉన్నట్లు గుర్తించారు. నిందితులను శనివారం కోర్టులో హాజరుపరచగా న్యాయస్థానం జ్యుడీషియల్ రిమాండ్ విధించినట్లు పోలీసులు తెలిపారు.





# మా భవిష్యత్తుకు హామీ ఏది?.. ఉపాధి ఉద్యోగుల గళం

- 20 ఏళ్లుగా సేవలు చేస్తున్నా అందని ఉద్యోగ భద్రత, వేతనాలు
- మహబూబాబాద్‌లో సమావేశమై కార్యాచరణ ప్రకటించిన జేఏసీ

**తొలివెలుగు, మహబూబాబాద్:** గత రెండు దశాబ్దాలుగా ఉపాధి హామీ పథకంలో అంకితభావంతో పనిచేస్తున్నప్పటికీ నేటికీ ఉద్యోగ భద్రత కరవైందని, సరైన సమయానికి వేతనాలు అందడం లేదని ఉపాధి హామీ ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేశారు. "మా భవిష్యత్తుకు హామీ ఏది?" అంటూ నిలదీస్తూ మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో వీబీజీ రామ్‌జీ ఉద్యోగులు శనివారం సమావేశం నిర్వహించి తమ భవిష్యత్ కార్యాచరణ ప్రణాళికను ప్రకటించారు.

**కనిపించని భద్రత.. కనీస వేతనాలు లేక:**

ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. కనీస వేతనం అమలు కావడం లేదని, ప్రతిరోజూ టార్గెట్లు, రివ్యూల పేరుతో తీవ్రమైన ఒత్తిడికి గురిచేస్తున్నారే తప్ప తమ సంక్షేమం గురించి మాత్రం ఎవరూ ఆలోచించడం లేదని మండిపడ్డారు. ఈ సమస్యల పరిష్కారానికై ఐక్యంగా పోరాడతామని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో జిల్లా జేఏసీ చైర్మన్ పార్థసారథి, కన్వీనర్లు ఎడ్ల యాకాంబరం, బన్సీలాల్, కృష్ణ, కీర్య, రంజిత్, జిల్లా కార్యాలయ సిబ్బంది, అన్ని మండలాల ఏపీఓలు, ఇంజనీరింగ్ కన్సల్టెంట్లు, టెక్నికల్ అసిస్టెంట్లు, కంప్యూటర్ ఆపరేటర్లు, బీవైపీటీఎస్, ఇతర సిబ్బంది అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# జ్యువెల్లరీ షాపులో భారీ చోరీ.. 7 తులాల బంగారం, 4 కిలోల వెండి అపహరణ

కొండాపూర్, ఆగస్టు 1 : చందానగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని శ్రీ బాలాజీ జ్యువెల్లరీ దుకాణంలో శుక్రవారం అర్ధరాత్రి భారీ దొంగతనం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... చందానగర్ బజాజ్ ఎలక్ట్రానిక్స్ పకనే ఉన్న శ్రీ బాలాజీ జ్యువెల్లరీ దుకాణం వెనుక భాగంలోని ఎగ్జాస్ట్ ఫ్యాన్‌ను తొలగించి.. గోడకు రంధ్రం చేసి లోపలికి ప్రవేశించిన దుండగులు, వెనుక గది నుంచి ముందు గదికి మధ్య ఉన్న తలుపునకు కన్నం చేసి షాప్‌లోని బంగారు, వెండి ఆభరణాలను ఎత్తుకెళ్లారు. ప్రాథమిక అంచనా ప్రకారం.. సుమారు 7 తులాల బంగారం, 4 కిలోల వెండి ఆభరణాలు చోరీకి గురైనట్లు గుర్తించారు.



## గీతన్నల చైతన్య యాత్ర పోస్టర్ ఆవిష్కరణ

- మహబూబాబాద్‌లో జరిగే యాత్రను విజయవంతం చేయాలి
- పిలుపునిచ్చిన సర్పంచ్ గునిగంటి కమలాకర్ గౌడ్

**తొలివెలుగు, చిన్నగూడూరు:** మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో ప్రారంభం కానున్న 'అమరుల యాదిలో గీతన్నల చైతన్య యాత్ర'ను విజయవంతం చేయాలని కోరుతూ శనివారం చిన్నగూడూరు మండలం గుండంరాజుపల్లి గ్రామ పంచాయతీ కార్యాలయం ఎదుట పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి గ్రామ సర్పంచ్ గునిగంటి కమలాకర్ గౌడ్ ముఖ్య అతిథిగా హాజరై పోస్టర్ ఆవిష్కరణ చేపట్టారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. గీత కార్మికుల సంక్షేమం, అమరుల ఆశయ సాధన కోసం నిర్వహించే ఈ చైతన్య యాత్రను మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో ఘనంగా ప్రారంభించనున్నట్లు తెలిపారు. ఈ యాత్రకు మండలంలోని గౌడ కులస్తులు, గ్రామ ప్రజలు అధిక సంఖ్యలో తరలివచ్చి జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రామ కుల పెద్దలు గునిగంటి వెంకన్న గౌడ్, పొన్నం శ్రీను గౌడ్, గునిగంటి కృష్ణ గౌడ్, ముతయ్య గౌడ్, మరో కృష్ణ గౌడ్, శ్రీనుగౌడ్, మహేష్ గౌడ్, సృజన్ గౌడ్, సుధాకర్ గౌడ్, సురేష్ గౌడ్, అశోక్ గౌడ్, సత్యనారాయణ గౌడ్, రామచంద్రు గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## తల్లిపాలే శిశువుకు తొలి రక్షణ కవచం

- అంగన్‌వాడి ఆధ్వర్యంలో తల్లిపాల వారోత్సవాలు
- అవగాహన కల్పించిన సీడీపీఓ వెంకటరమణ




**తొలివెలుగు, వలిగొండ:** రామన్నపేట ప్రాజెక్టు పరిధిలోని అక్కంపల్లి గ్రామంలో శనివారం అంగన్‌వాడి కేంద్రం ఆధ్వర్యంలో తల్లిపాల వారోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీడీపీఓ వెంకటరమణ ముఖ్య అతిథిగా పాల్గొని తల్లిపాల ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పుట్టిన వెంటనే శిశువుకు ముర్రుపాలు (కొలస్ట్రం) పట్టించడం అత్యంత అవసరమని, అవే శిశువుకు తొలి వ్యాక్సిన్‌లా పనిచేసి రోగనిరోధక శక్తిని పెంపొందిస్తాయని వివరించారు. శిశువు ఆరోగ్యకరమైన ఎదుగుదలకు తల్లిపాలు ఎంతో కీలకమని పేర్కొంటూ, ప్రతి తల్లి శిశువుకు తప్పనిసరిగా తల్లిపాలు అందించాలని సూచించారు. అలాగే అంగన్‌వాడి కేంద్రాల ద్వారా గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు అందిస్తున్న పౌష్టికాహారాన్ని అర్హులైన ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు. తల్లి-శిశు ఆరోగ్య పరిరక్షణలో అంగన్‌వాడి సేవలు కీలక పాత్ర పోషిస్తున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్వైజర్ పి. పారిజాత, గ్రామ సెక్రటరీ చంద్రమౌళి, సెక్టార్ అంగన్‌వాడి టీచర్ మంజుల, అంగన్‌వాడి టీచర్లు రాపోలు సునీత, బాల విజయ, పుణ్యవతి, కలమ్మ, నాగమణి, తల్లులు, గర్భిణులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

## గౌడ సంఘం అధ్యక్షుడిగా మొర్రి యాదయ్య గౌడ్ ఏకగ్రీవం

- నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్న గౌడ సంఘం సభ్యులు
- అభినందించిన గ్రామ ప్రముఖులు, సంఘ సభ్యులు

**తొలివెలుగు, వలిగొండ:** యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండలంలోని నెమలికాల్వ గ్రామ గౌడ సంఘం నూతన కార్యవర్గాన్ని శనివారం సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సంఘం అధ్యక్షుడిగా మొర్రి యాదయ్య గౌడ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అలాగే ఉపాధ్యక్షులుగా వంగాల బాలకృష్ణ గౌడ్, గోపగోని దేవేందర్ గౌడ్, ప్రధాన కార్యదర్శిగా వంగాల శ్రీనివాస్ గౌడ్, కోశాధికారిగా నిలుగొండ ఆనంద్ గౌడ్ బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు మొర్రి యాదయ్య గౌడ్ మాట్లాడుతూ.. గౌడ సంఘం ఐక్యత, అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తానని తెలిపారు. సంఘ సభ్యులందరినీ కలుపుకొని సామాజిక సేవా కార్యక్రమాలు చేపడుతూ సంఘాన్ని మరింత బలోపేతం చేసేందుకు కట్టుబడి ఉంటానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ వంగాల బిక్షపతి గౌడ్, ఉప సర్పంచ్ శ్రీనివాస్ గౌడ్, నిలుగొండ వెంకటేష్ గౌడ్, మర్రి సత్యనారాయణ గౌడ్, వంగాల నాగరాజు గౌడ్, కిషన్ గౌడ్, సుంకరి నాగరాజు గౌడ్, వంగాల నరేష్ గౌడ్ తదితరులతో పాటు గౌడ సంఘం సభ్యులు, గ్రామ పెద్దలు పాల్గొని నూతన కార్యవర్గ సభ్యులకు ఘనంగా శుభాకాంక్షలు తెలిపారు.



## ఎమ్మార్పీఎస్‌ను శక్తివంతమైన ఉద్యమ సైన్యంగా తీర్చిదిద్దాలి

- యువతను ఉద్యమంలోకి తీసుకురావాలి..
- గ్రామస్థాయిలో చైతన్య కార్యక్రమాలు నిర్వహించాలి
- జిల్లా ఇన్‌చార్జిలు బిర్రు మహేందర్, దుబ్బా రామకృష్ణ



**తొలివెలుగు, భూదాన్ పోచంపల్లి:** నూతన తరాన్ని ఎమ్మార్పీఎస్‌లోకి తీసుకువచ్చి ఉద్యమాన్ని మరింత బలోపేతం చేయాలని ఎమ్మార్పీఎస్ జిల్లా ఇన్‌చార్జిలు బిర్రు మహేందర్, దుబ్బా రామకృష్ణ పిలుపునిచ్చారు. శనివారం భూదాన్ పోచంపల్లి పురపాలక కేంద్రంలోని సాయి బాలాజీ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన ఎమ్మార్పీఎస్ మండల స్థాయి సమావేశంలో వారు ముఖ్య అతిథులుగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కుల వివక్ష నిర్మూలనతో పాటు అణగారిన, వెనుకబడిన వర్గాల సామాజిక, ఆర్థిక అభ్యున్నతే ఎమ్మార్పీఎస్ ప్రధాన లక్ష్యమని అన్నారు. గ్రామస్థాయిలో ప్రజల్లో సామాజిక, రాజకీయ చైతన్యం పెంపొందిస్తూ సమస్యల పరిష్కారం కోసం ఉద్యమాలను మరింత విస్తృతం చేయాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. పద్మశ్రీ మందకృష్ణ మాదిగ ఆశయాలను గ్రామీణ ప్రాంతాలకు తీసుకెళ్లి, యువతను ఉద్యమంలో భాగస్వాములను చేయాలని సూచించారు. మండల, పట్టణ నాయకులు సంఘటితంగా పనిచేసి ఎమ్మార్పీఎస్‌ను మరింత శక్తివంతమైన ఉద్యమ సైన్యంగా తీర్చిదిద్దాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో మండల కో-ఇన్‌చార్జి పాముకుంట్ల బసవయ్య, టౌన్ ఇన్‌చార్జి పోతగల శ్రీనివాస్, కౌన్సిలర్ పెద్దల చక్రపాణి, కొండమడుగు ఎల్లస్వామి, జూలూరు మాజీ సర్పంచ్ యాకరి నర్సింగరావు, గుడి చైర్మన్ చిన్న మల్లయ్య, ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు ఎడ్ల లింగస్వామి, కుక్కస్వామి, కరగళ్ల కుమార్, చెరుకు వెంకటేష్, కొమ్ము లక్ష్మణ్, వంగూరు స్వామి, కొండమడుగు రవి, గణేష్, నల్ల బాలస్వామి, మూటపురం రవి, పెద్దల సుధాకర్, నల్ల లింగస్వామి, కుక్క బాలనరసింహ, కుక్క శివ, ఓరుగంటి రాకేష్, శ్రీకాంత్, సంపత్, రమేష్, భాస్కర్ పాల్గొన్నారు.

## తల్లిపాలు బిడ్డకు అమృతం: సర్పంచ్ ఆర్ల కావ్య వెంకటేష్



- జిబ్లక్ పల్లిలో ఘనంగా తల్లిపాల వారోత్సవాలు
- బాలింతలకు చీరలు పంపిణీ చేసిన సర్పంచ్
- తల్లిపాలతో రోగనిరోధక శక్తి, ఆరోగ్య రక్షణ

**తొలివెలుగు, భూదాన్ పోచంపల్లి:** పుట్టిన పిల్లలకు తల్లిపాలు అమృతంతో సమానమని, వాటి ద్వారానే బిడ్డలకు సంపూర్ణ ఆరోగ్యం చేకూరుతుందని సర్పంచ్ ఆర్ల కావ్య వెంకటేష్ అన్నారు. భూదాన్ పోచంపల్లి మండలంలోని జిబ్లక్ పల్లి గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో శనివారం తల్లిపాల వారోత్సవాల కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై బాలింతలకు చీరలు పంపిణీ చేశారు. అనంతరం తల్లిపాల ప్రాముఖ్యతపై నిర్వహించిన అవగాహన సదస్సులో ఆమె మాట్లాడారు. పుట్టిన ప్రతి బిడ్డకు తల్లిపాలు పట్టడం ద్వారా వారికి రోగనిరోధక శక్తితో పాటు మంచి తెలివితేటలు పెరుగుతాయని తెలిపారు. అంతేకాకుండా బాలింతలు రొమ్ము క్యాన్సర్ బారిన పడకుండా ఉండేందుకు తల్లిపాలు ఇవ్వడం ఎంతగానో దోహదపడుతుందని పేర్కొన్నారు. అమృతం లాంటి తల్లిపాలను అందించడం ద్వారా ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి బాటలు వేయవచ్చని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ ఆర్ల లింగస్వామి యాదవ్, సూపర్‌వైజర్ సుజాత, అంగన్‌వాడీ టీచర్ పామంజుల, ఏఎన్ఎం నీలమ్మ, ఆయా మంజుల తదితరులు పాల్గొన్నారు.

## అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా లింగోటంలో గ్రామసభ

- జలసిరి, మహిళా సాధికారత, డ్రగ్స్ నిర్మూలనపై విస్తృత చర్చ
- హాజరైన ఎంపీడీఓ శ్రీలత, టౌన్ ఇన్‌స్పెక్టర్ మన్మథకుమార్, ఎస్ఐ అజయ్ భార్గవ్
- ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దడమే మా ధ్యేయం: సర్పంచ్ భీమిడి ప్రదీప్ జీ







**తొలివెలుగు, చౌటుప్పల్:** యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలం స్వాములవారి లింగోటం గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద శనివారం గ్రామ సర్పంచ్ భీమిడి ప్రదీప్ జీ అధ్యక్షతన గ్రామసభ ఘనంగా నిర్వహించారు. గ్రామాభివృద్ధి, జలసిరి, నీటి సంరక్షణ, మహిళా సాధికారత, బాలసభ, ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు, మాదకద్రవ్యాల నిర్మూలన, సైబర్ నేరాల నివారణ తదితర అంశాలపై గ్రామ ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించారు. గ్రామసభకు ముఖ్య అతిథిగా హాజరైన మండల అభివృద్ధి అధికారి (ఎంపీడీవో) శ్రీలత మాట్లాడుతూ.. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల ప్రయోజనాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. గ్రామ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను గ్రామ పంచాయతీతో సమన్వయం చేసుకుంటూ పరిష్కరించి అభివృద్ధి కార్యక్రమాలను వేగవంతం చేస్తామని హామీ ఇచ్చారు. చౌటుప్పల్ టౌన్ ఇన్‌స్పెక్టర్ జి. మన్మథకుమార్ మాట్లాడుతూ.. యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని సూచించారు. డ్రగ్స్ మాఫియాపై కఠిన చర్యలు కొనసాగుతాయని హెచ్చరించారు. అలాగే సోషల్ మీడియాను బాధ్యతాయుతంగా వినియోగించాలని, సైబర్ మోసాలకు గురైన వెంటనే 1930 హెల్ప్‌లైన్‌కు ఫిర్యాదు చేయాలని గ్రామ ప్రజలకు సూచించారు. ఎస్ఐ అజయ్ భార్గవ్ మాట్లాడుతూ.. గ్రామంలో శాంతిభద్రతల పరిరక్షణలో ప్రజలు పోలీసులకు సహకరించాలని కోరారు. అనుమానాస్పద సంఘటనలు కనిపించిన వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. సీడీఈడబ్ల్యూ కృష్ణవేణి మహిళా సాధికారతపై మాట్లాడుతూ.. మహిళలు స్వయం ఉపాధి అవకాశాలను సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా బలోపేతం కావాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వం అందిస్తున్న రుణాలు, శిక్షణా కార్యక్రమాలు, సంక్షేమ పథకాలను వినియోగించుకోవాలని సూచించారు. గ్రామ సర్పంచ్ భీమిడి ప్రదీప్ జీ మాట్లాడుతూ.. స్వాములవారి లింగోటాన్ని అన్ని రంగాల్లో ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. గ్రామంలో సీసీ రోడ్లు, ఆధునిక డ్రైనేజీ వ్యవస్థ, వీధి దీపాలు, సీసీ కెమెరాల ఏర్పాటు వంటి అభివృద్ధి పనులు వేగంగా కొనసాగుతున్నాయని చెప్పారు. ఇందిరమ్మ గృహ పథకం తొలి విడతలో అర్హులకు ఇళ్లు, పెన్షన్లు అందించామని, రెండో విడతలో మిగిలిన అర్హులందరికీ లబ్ధి చేకూరేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. గ్రామాభివృద్ధికి సహకరిస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు, గ్రామ ప్రజలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. గ్రామసభ అనంతరం గ్రామంలోని శ్రీ ఓంకారేశ్వర స్వామి దేవాలయం ఆవరణలో కమ్యూనిటీ సోక్‌పిట్ నిర్మాణానికి శంకుస్థాపన చేయడంతో పాటు పలు వార్డుల్లో ఇంకుడు గుంతల నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టారు. అనంతరం హైస్కూల్ ఆవరణలో వనమహోత్సవ కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటి పచ్చదనం పెంపొందించడంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ బాతరాజు ధనంజయ్, గ్రామ పంచాయతీ కార్యదర్శి కావ్య, వార్డు సభ్యులు, దేవస్థానం చైర్మన్, ఆశా వర్కర్లు, అంగన్‌వాడీ టీచర్లు, ఉపాధి హామీ ఫీల్డ్ అధికారులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు, చేనేత సంఘం ప్రతినిధులు, మహిళా సంఘాల సభ్యులు, మాజీ ప్రజాప్రతినిధులు, యువత, విద్యార్థులు, గ్రామ పెద్దలు, గ్రామ ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## బీజేపీ మండల ప్రధాన కార్యదర్శిగా ఉప్పునూతల నరసింహ నియామకం

- గ్రామీణ స్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేయాలి: రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఏలే చంద్రశేఖర్



**తొలివెలుగు, భూదాన్ పోచంపల్లి:** భారతీయ జనతా పార్టీని గ్రామీణ స్థాయిలో మరింత బలోపేతం చేసి ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు కార్యకర్తలు సమష్టిగా కృషి చేయాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఏలే చంద్రశేఖర్ పిలుపునిచ్చారు. శనివారం భూదాన్ పోచంపల్లి పురపాలక కేంద్రంలో బీజేపీ మండల శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా పార్టీ మండల ప్రధాన కార్యదర్శిగా ఉప్పునూతల నరసింహను నియమిస్తూ ఆయనకు నియామక పత్రాన్ని అందజేశారు. నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ఉప్పునూతల నరసింహ మాట్లాడుతూ.. పార్టీ తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటానని తెలిపారు. మండల స్థాయిలో కార్యకర్తలందరినీ సమన్వయం చేసుకుంటూ పార్టీ బలోపేతానికి అంకితభావంతో పనిచేస్తానని పేర్కొన్నారు. ఈ సమావేశానికి బీజేపీ మండల అధ్యక్షుడు మేకల రవీందర్ రెడ్డి అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో అసెంబ్లీ కన్వీనర్ చిక్క కృష్ణ, జిల్లా కౌన్సిల్ సభ్యుడు పల్లకాడి బసవయ్య, జిల్లా ఎస్సీ మోర్చా అధ్యక్షుడు చెరుకు వెంకటేష్, జిల్లా కిసాన్ మోర్చా ఉపాధ్యక్షుడు మేకల చొక్కారెడ్డి, జిల్లా చేనేత సెల్ అధ్యక్షుడు గంజి బసవలింగం, మండల ఉపాధ్యక్షుడు బోదాసు మల్లేష్, మండల జనరల్ సెక్రటరీ వెంకటేశం, జిల్లా ఎండోమెంట్ కన్వీనర్ కేసారం కృష్ణారెడ్డి, మండల బీజేవైఎం అధ్యక్షుడు మేకల చంద్రవాస్, సీతా లక్ష్మయ్య, మేకల లింగస్వామి, చిలకల మల్లయ్య, వినయ్ చారి, జంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థి దశలోనే చట్టాలపై అవగాహన పెంచుకోవాలి

- రామన్నపేట అదనపు జూనియర్ సివిల్ జడ్జి వి. రత్నకుమారి పిలుపు
- వెల్లంకి పాఠశాలలో ఘనంగా న్యాయ అవగాహన సదస్సు




**తొలివెలుగు, రామన్నపేట:** విద్యార్థులు విద్యతో పాటు చట్టాలపై కూడా అవగాహన పెంపొందించుకొని బాధ్యతాయుతమైన పౌరులుగా ఎదగాలని రామన్నపేట అదనపు జూనియర్ సివిల్ జడ్జి వి. రత్నకుమారి అన్నారు. మండల పరిధిలోని వెల్లంకి గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం మండల న్యాయ సేవా అధికార సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన న్యాయ అవగాహన సదస్సుకు ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఇన్‌చార్జి మండల విద్యాధికారి సురేందర్ రెడ్డి అధ్యక్షతన ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ.. విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలంటే తల్లిదండ్రుల ప్రోత్సాహం ఎంతో కీలకమని పేర్కొన్నారు. విద్య ద్వారానే ప్రపంచాన్ని మార్చే అవకాశం లభిస్తుందని, జీవితంలో ఎలాంటి సమస్యలు ఎదురైనా ధైర్యంగా పరిష్కార మార్గాల వైపు అడుగులు వేయాలని సూచించారు. ప్రతి ఒక్కరూ విద్యా హక్కు చట్టం, బాల కార్మిక నిరోధక చట్టం, బాల్య వివాహాల నిషేధ చట్టం, పోక్సో చట్టం, కార్మిక చట్టాలు, మాదకద్రవ్యాల నియంత్రణ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని కోరారు. మహిళలు, పిల్లలు ఎలాంటి సమస్య ఎదుర్కొన్నా వెంటనే పోలీస్ స్టేషన్ లేదా న్యాయ సేవా సంస్థను ఆశ్రయించాలని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో రామన్నపేట బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎం.ఏ. మజీద్, లీగల్ ఎయిడ్ కౌన్సిల్స్ మొగలయ్య, ఎన్. స్వామి, ప్యానల్ అడ్వకేట్లు కూనూరు శ్రీనివాస్, సోమ శ్రీనివాస్ రెడ్డి, పాల్వంచ జగతయ్య, నరసింహ, ఎం.ఏ. అజీమ్, లీగల్ సర్వీసెస్ టీమ్ సభ్యుడు బత్తుల గణేష్, అగ్రి క్లినిక్ సభ్యుడు కానుగంటి శ్రీశైలం, అధ్యాపక బృందం, కోర్టు సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## చేనేత సహకార సంఘాల బలోపేతానికి పూర్తి సహకారం

- జిల్లా చేనేత జౌళి శాఖ సహాయ సంచాలకులు ఎ. శ్రీనివాసరావు
- మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించిన లక్ష్మీ సిల్క్ సంఘం నూతన పాలకవర్గం

**తొలివెలుగు, రామన్నపేట:** చేనేత సహకార సంఘాల అభివృద్ధి, బలోపేతానికి శాఖ తరఫున పూర్తి సహకారం అందిస్తామని జిల్లా చేనేత జౌళి శాఖ సహాయ సంచాలకులు ఎ. శ్రీనివాసరావు తెలిపారు. రామన్నపేట పరిధిలోని లక్ష్మీ సిల్క్ చేనేత సహకార సంఘం నూతన పాలకవర్గం శనివారం ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చేనేత కార్మికుల సంక్షేమం, ఉపాధి అవకాశాల పెంపు, చేనేత పరిశ్రమ అభివృద్ధి కోసం సహకార సంఘాల పాలకవర్గాలు సమన్వయంతో కృషి చేయాలని సూచించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రతి చేనేత కార్మికుడికి చేరేలా సంఘాలు ప్రత్యేక చొరవ చూపాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో చేనేత జౌళి శాఖ ఏడీఓ అఖిల్ రెడ్డి, లక్ష్మీ సిల్క్ చేనేత సహకార సంఘం అధ్యక్షుడు వనం సుధాకర్, ఉపాధ్యక్షుడు వనం బిక్షపతి, కార్యదర్శి బోడ వెంకటేశ్వర్లు, డైరెక్టర్లు చిందం పద్మ, పెండెం అరుణ, మహేశ్వరం అశోక్, తోర్ర రఘు, వనం శ్రీనివాస్, వనం అంబదాస్, చేనేత కార్మికులు తదితరులు పాల్గొన్నారు.



# భక్తిశ్రద్ధలతో ఆందోళ్ మైసమ్మ బోనాలోత్సవాలు

- అఖండ దీపారాధన, గణపతి పూజలతో వైభవంగా 21వ వార్షిక ఉత్సవాలకు శ్రీకారం
- ముఖ్య అతిథిగా హాజరైన దేవాదాయ శాఖ సహాయ కమిషనర్ కె. భాస్కర్
- భక్తులకు అన్ని వసతులు కల్పించాం: ఈఓ సల్వాది మోహన్ బాబు






**తొలివెలుగు, చౌటుప్పల్:** యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలం దండు మల్కాపురం గ్రామంలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రం శ్రీ ఆందోళ్ మైసమ్మ దేవస్థానంలో 21వ వార్షిక బోనాలోత్సవాలు శనివారం భక్తిశ్రద్ధల మధ్య ఘనంగా ప్రారంభమయ్యాయి. ఉత్సవాల తొలి రోజు ఆలయంలో అఖండ దీపారాధన, ప్రత్యేక గణపతి పూజలు, అమ్మవారికి విశేష అలంకరణ, హారతులు, మహా అన్నదాన కార్యక్రమాలను వైభవంగా నిర్వహించారు. ఉదయం నుంచే పెద్ద సంఖ్యలో భక్తులు ఆలయానికి చేరుకుని అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణమంతా భక్తుల రద్దీతో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది.

**ఉత్సవాల్లో పాల్గొన్న దేవాదాయ శాఖ సహాయ కమిషనర్:**

ఈ కార్యక్రమానికి నల్గొండ దేవాదాయ శాఖ సహాయ కమిషనర్ కె. భాస్కర్ ముఖ్య అతిథిగా హాజరై అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయంలో జరుగుతున్న ఏర్పాట్లను పరిశీలించి దేవస్థాన అధికారులు, ధర్మకర్తల మండలి సభ్యులను అభినందించారు. ఉత్సవాలకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని సౌకర్యాలు కల్పించాలని సూచించారు. దేవస్థాన అభివృద్ధితో పాటు భక్తులకు మెరుగైన సేవలు అందించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు.

**భక్తులకు విస్తృత వసతులు:**

దేవస్థాన కార్యనిర్వాహణాధికారి (ఈఓ) సల్వాది మోహన్ బాబు, ఆలయ చైర్మన్ కంచర్ల అశ్విన్ రెడ్డి మాట్లాడుతూ బోనాలోత్సవాలకు వేలాది మంది భక్తులు తరలివచ్చే అవకాశాన్ని దృష్టిలో ఉంచుకుని అన్ని రకాల ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. తాగునీరు, క్యూలైన్లు, పరిశుభ్రత, విద్యుత్ సౌకర్యం, పార్కింగ్, భద్రతతో పాటు భక్తులకు అవసరమైన అన్ని మౌలిక సదుపాయాలను అందుబాటులో ఉంచామని చెప్పారు. ఉత్సవాలు ప్రశాంతంగా, విజయవంతంగా జరిగేలా అధికారులు, సిబ్బంది నిరంతరం పర్యవేక్షిస్తున్నారని వివరించారు.

**భక్తులకు మహా అన్నదానం:**

ఉత్సవాల సందర్భంగా భక్తులకు మహా అన్నదాన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ అన్నదాన కార్యక్రమానికి కొమిరిశెట్టి విజయ్‌కుమార్–శిరీష దంపతులు తమ సేవాభావాన్ని చాటుకున్నారు. అమ్మవారి దర్శనానికి వచ్చిన భక్తులందరికీ అన్నప్రసాదాన్ని పంపిణీ చేయడంతో ఆలయ ప్రాంగణంలో భక్తి, సేవా భావం వెల్లివిరిసింది. ఈ కార్యక్రమంలో దేవస్థాన ధర్మకర్తల మండలి సభ్యులు ఈడుదుల బాబు, బేతాళ నరసింహ, సిద్ధిపేట ఆనందరెడ్డి, వెంకిర్యాల శివ, బాలగోని శ్రీకాంత్ గౌడ్, బొంతల యువరాజ్, మన్నె మహేందర్ రెడ్డి, దాడీ రాజేష్, పన్నాల మహేందర్ రెడ్డి, ధేప రాజీవ్, పంతంగి రమేష్, జొన్నగంటి దాసు, చిట్టెంపల్లి సబిత, ఆలయ అర్చకులు వల్లూరి శివప్రసాద్ శర్మతో పాటు గ్రామ ప్రముఖులు, ప్రజాప్రతినిధులు, వివిధ గ్రామాల నుంచి విచ్చేసిన భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉత్సవాల సందర్భంగా ఆలయ ప్రాంగణమంతా ఆధ్యాత్మిక శోభ సంతరించుకోగా, భక్తులు అమ్మవారికి బోనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఉత్సవాలు విజయవంతంగా కొనసాగేందుకు దేవస్థాన అధికారులు, ధర్మకర్తల మండలి సభ్యులు ప్రత్యేక ఏర్పాట్లు చేపట్టారు. తొలి రోజే భారీ సంఖ్యలో భక్తులు తరలిరావడంతో ఆలయం భక్తిజన సందోహంతో కళకళలాడింది.





## మత విద్వేషాలతో ప్రజా సమస్యలను పక్కదారి పట్టిస్తున్నారు






- కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వంపై సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు బండారు రవికుమార్ విమర్శ
- రామన్నపేటలో ఘనంగా సీపీఎం మండల స్థాయి రాజకీయ శిక్షణా తరగతులు

**తొలివెలుగు, రామన్నపేట:జ** కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం మత విద్వేషాలను రెచ్చగొడుతూ ప్రజల అసలు సమస్యలను పక్కదారి పట్టిస్తోందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు బండారు రవికుమార్ విమర్శించారు. రామన్నపేటలో సీపీఎం మండల కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన మండల స్థాయి రాజకీయ శిక్షణా తరగతులకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా పార్టీ శ్రేణులు ప్రజా పోరాటాలను మరింత బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద శాంతియుతంగా ఆందోళన చేస్తున్న విద్యార్థులపై జరిగిన పోలీసు దాడిని ఆయన తీవ్రంగా ఖండించారు. విద్యార్థి నాయకులపై నమోదైన తప్పుడు కేసులను వెంటనే ఎత్తివేసి, కక్షసాధింపు చర్యలను కేంద్ర ప్రభుత్వం విరమించుకోవాలని డిమాండ్ చేశారు. అంతకుముందు సీపీఎం సీనియర్ నాయకుడు పబ్బతి లింగయ్య పార్టీ జెండాను ఆవిష్కరించగా.. తెలంగాణ సాయుధ పోరాట యోధుడు కచం కృష్ణమూర్తి, మాజీ మండల కమిటీ సభ్యుడు పిట్టల శ్రీనివాస్ చిత్రపటాలకు నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా, మండల నాయకులు, డీవైఎఫ్ఐ, వ్యవసాయ కార్మిక సంఘం ప్రతినిధులు, పార్టీ కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



## గోరింటాకు మురిపాలు.. ఆషాడ సంబరాలు

- జేబీఎం ఒకేషనల్ జూనియర్ కళాశాలలో వేడుకలు
- సంప్రదాయాలకు ప్రతీక గోరింటాకు: కరస్పాండెంట్ గంగాపురం నిర్మల

**తొలివెలుగు, చౌటుప్పల్:** చౌటుప్పల్ పురపాలిక కేంద్రంలోని మార్కండేయ నగర్‌లో ఉన్న జేబీఎం ఒకేషనల్ జూనియర్ కళాశాలలో ఆషాఢ మాసం సందర్భంగా గోరింటాకు సంబరాలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రాంగణంలో పండుగ వాతావరణం నెలకొంది. విద్యార్థినులు ఒకరి చేతులకు మరొకరు గోరింటాకు పెట్టుకుని సందడి చేస్తూ సంప్రదాయ వేడుకలను ఆనందంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా కళాశాల కరస్పాండెంట్ గంగాపురం నిర్మల మాట్లాడుతూ.. ఆషాఢ మాసంలో గోరింటాకు పెట్టుకోవడం తెలుగు వారి సంప్రదాయంలో విశేష ప్రాధాన్యం సంతరించుకుందని తెలిపారు. ఇది కేవలం సౌందర్యానికి మాత్రమే కాకుండా మన సాంస్కృతిక వారసత్వానికి ప్రతీక అని పేర్కొన్నారు. ఇలాంటి కార్యక్రమాలు విద్యార్థినుల్లో సంప్రదాయాలపై అవగాహన పెంపొందించడంతో పాటు, వారి మధ్య స్నేహభావాన్ని పెంపొందిస్తాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ గంగాపురం జంగయ్య, అధ్యాపకులు మాధవి, రంజిత్, యువరాజు, స్వాతి, జ్యోతి, మమత తదితరులతో పాటు విద్యార్థినులు పాల్గొన్నారు.

## నిమ్స్‌లో యువతిపై లైంగిక వేధింపులు.. నిందితుడు అరెస్ట్

ఖైరతాబాద్, ఆగస్టు 1 : నిమ్స్ దవాఖానలో చికిత్స పొందుతున్న ఓ యువతిపై మరో రోగికి సహాయకుడిగా వచ్చిన వ్యక్తి కీచక పర్వానికి ఒడిగట్టాడు. పంజాగుట్ట పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు చెందిన ఆర్ఎంపీ వైద్యుడు గత నెల 27న రోడ్డుప్రమాదంలో తీవ్రంగా గాయపడి రెండు కాళ్లు విరిగిపోయిన కుమార్తె(18) ను నిమ్స్‌లో చేర్చాడు. ఆమెకు ఎమర్జెన్సీ వార్డులో చికిత్స అందిస్తున్నారు. శుక్రవారం తెల్లవారుజామున తండ్రి మరుగుదొడ్డికి వెళ్లిన సమయంలో పక్క బెడ్‌లో చికిత్స పొందుతున్న రోగికి సహాయకుడిగా వచ్చిన నాగేశ్వర్‌రావు అనే వ్యక్తి యువతి వద్దకు వెళ్లి అసభ్యకరంగా తాకుతూ లైంగికంగా వేధించాడు.

ఘటన అనంతరం తీవ్ర భయాందోళనకు గురైన యువతి తన తండ్రికి జరిగిన దారుణాన్ని వివరించింది. విషయాన్ని అదేరోజు సాయంత్రం ఆస్పత్రి సిబ్బందికి తెలియజేయగా, పోలీసులకు సమాచారం అందించారు. ఆస్పత్రిలోని సీసీటీవీ దృశ్యాలు, అక్కడి సిబ్బంది, ప్రత్యక్ష సాక్షుల వాంగ్మూలాలను సేకరించారు. బాధితురాలి తండ్రి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కాగా యువతితో అసభ్యకరంగా ప్రవర్తించిన నిందితుడు నాగేశ్వర్‌రావు ఏపీలోని భీమవరానికి చెందిన వ్యక్తిగా పోలీసులు గుర్తించారు. నిందితుడిని అదుపులోకి తీసుకొని రిమాండ్‌కు తరలించినట్లు పంజాగుట్ట సీఐ జహంగీర్ యాదవ్ తెలిపారు.

## చేనేత చైతన్య మహాసభను విజయవంతం చేయాలి

- ఆగస్టు 5న కరీంనగర్‌లో రాష్ట్రస్థాయి మహాసభ: చేనేత ఐక్యవేదిక పిలుపు
- రామన్నపేటలో చైతన్య మహాసభ పోస్టర్ ఆవిష్కరణ



**తొలివెలుగు, రామన్నపేట:** జాతీయ చేనేత దినోత్సవాన్ని పురస్కరించుకుని తెలంగాణ చేనేత ఐక్యవేదిక ఆధ్వర్యంలో ఆగస్టు 5న కరీంనగర్-జగిత్యాల రోడ్డులోని పద్మశాలి భవన్‌లో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి చేనేత చైతన్య మహాసభను విజయవంతం చేయాలని చేనేత ఐక్యవేదిక రాష్ట్ర కార్యదర్శి పెండెం లక్ష్మీనారాయణ, రాష్ట్ర క్రమశిక్షణ కమిటీ సభ్యులు బూరుగు వెంకటేశం పిలుపునిచ్చారు. శనివారం మండల కేంద్రంతో పాటు సిరిపురం గ్రామంలో చేనేత చైతన్య మహాసభ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మహాసభలో రాష్ట్రవ్యాప్తంగా ఎన్నికైన 17 మంది పద్మశాలి మున్సిపల్ చైర్మన్లు, కౌన్సిలర్లు, కార్పొరేటర్లు, నూతనంగా ఎన్నికైన చేనేత సహకార సంఘాల అధ్యక్షులను ఘనంగా సత్కరించనున్నట్లు తెలిపారు. ఈ మహాసభకు రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్యే గంగుల కమలాకర్, మేయర్ కొనగాని శ్రీనివాస్, మున్సిపల్ చైర్మన్లు గూడూరు శ్రీనివాస్, దూలం వెంకటరమణ, రాజ్యసభ మాజీ సభ్యుడు రాపోలు ఆనంద భాస్కర్, రిటైర్డ్ ఐఏఎస్ అధికారి పి. చిరంజీవులు ముఖ్య అతిథులుగా హాజరుకానున్నట్లు వెల్లడించారు. పద్మశాలి ప్రజాప్రతినిధులు, చేనేత వృత్తిదారులు, యువకులు పెద్ద సంఖ్యలో తరలిరావాలని కోరారు. ఈ కార్యక్రమంలో చేనేత ఐక్యవేదిక యువజన విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు రాపోలు రాజశేఖర్, సిరిపురం చేనేత సహకార సంఘం అధ్యక్షుడు రాపోలు షణ్ముఖం, పట్టణ పద్మశాలి సంఘం అధ్యక్షుడు రచ్చ యాదగిరి, సిరిపురం పద్మశాలి సంఘం అధ్యక్షుడు జెల్ల శ్రీనివాస్, డీసీఎంఎస్ మాజీ డైరెక్టర్ జెల్ల వెంకటేష్, మాజీ సర్పంచ్ అప్పం లక్ష్మీనర్సు, మాజీ ఎంపీటీసీలు పున్న వెంకటేశం, బడుగు రమేష్, సిల్క్ చేనేత సహకార సంఘం డైరెక్టర్ మహేశ్వరం అశోక్, నాయకులు కైరంకొండ నందు, కొంగరి నరసింహ, గంజి అశోక్, చిందం ఉమాకాంతం తదితరులు పాల్గొన్నారు.

## ముర్రుపాలతోనే శిశువుకు సంపూర్ణ ఆరోగ్యం





- ఇంద్రపాలనగరంలో ఘనంగా ప్రపంచ తల్లిపాల వారోత్సవాలు
- హాజరైన సర్పంచ్ గర్ధాస్ విక్రమ్, సీడీపీఓ వెంకటరమణ
- తల్లిపాలే శిశువుకు తొలి రక్షణ కవచం: సర్పంచ్ గర్ధాస్ విక్రమ్

**తొలివెలుగు, రామన్నపేట:** ప్రసవం అనంతరం తొలి అరగంటలోనే నవజాత శిశువుకు ముర్రుపాలు పట్టించడం అత్యంత అవసరమని సర్పంచ్ గర్ధాస్ విక్రమ్ అన్నారు. ప్రపంచ తల్లిపాల వారోత్సవాల సందర్భంగా యాదాద్రి భువనగిరి జిల్లా రామన్నపేట మండలంలోని ఇంద్రపాలనగరం గ్రామంలో శనివారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ముర్రుపాలు శిశువుకు సహజ రోగనిరోధక శక్తిని అందించడంతో పాటు ఆరోగ్యవంతమైన ఎదుగుదలకు బలమైన పునాది వేస్తాయని పేర్కొన్నారు. తొలి ఆరు నెలల పాటు శిశువుకు కేవలం తల్లిపాలు మాత్రమే అందించాలని, గర్భిణీలు, బాలింతలు తల్లిపాల ప్రాముఖ్యతను గుర్తించి వాటిని తప్పనిసరిగా అందించాలని సూచించారు. అనంతరం తల్లిపాల ప్రాధాన్యత, తల్లి-శిశు ఆరోగ్య సంరక్షణ, పోషకాహారం, నవజాత శిశువుల సంరక్షణపై విస్తృతంగా అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సీడీపీఓ వెంకటరమణ, పంచాయతీ కార్యదర్శి నరేందర్, సూపర్‌వైజర్ సుజాత, పోషణ అభియాన్ ప్రతినిధి భాజా అశోక్, అంగన్‌వాడీ టీచర్లు, ఆశా కార్యకర్తలు, గర్భిణీలు, బాలింతలు పాల్గొన్నారు.

# స్పోర్ట్స్



## 'డెకా'లో తేజస్విన్ కేక

కామన్వెల్త్ క్రీడల చరిత్రలో డెకాథ్లాన్ పోటీల్లో పతకం గెలుచుకున్న తొలి భారత అథ్లెట్‌గా తేజస్విన్ శంకర్ గుర్తింపు పొందాడు. శుక్రవారం జరిగిన ఈ పోటీల్లో అతను కాంస్య పతకంతో సత్తా చాటాడు. పది వేర్వేరు ఈవెంట్ల సమాహారమైన డెకాథ్లాన్‌లో తేజస్విన్ ఓవరాల్‌గా 7976 పాయింట్లతో మూడో స్థానంలో నిలిచాడు. లిండన్ విక్టర్ (గ్రెనడా -- 8096) స్వర్ణం గెలుచుకోగా, డామియాన్ వార్నర్ (కెనడా -- 8036)కు కాంస్యం లభించింది. 2022 కామన్వెల్త్ క్రీడల హైజంప్‌లో కాంస్యం సాధించిన తేజస్విన్...ఈ పోటీల రెండు వేర్వేరు క్రీడాంశాల్లో పతకం నెగ్గిన తొలి భారతీయుడిగా కూడా ఘనత సాధించాడు. తాజా పోటీల హైజంప్ ఈవెంట్‌లో తొలి ప్రయత్నంలో విఫలమైన తర్వాత తేజస్విన్ బరినుంచి తప్పుకున్నాడు. సుదీర్ఘకాలంగా తనను ఇబ్బంది పెడుతున్న మోకాలి గాయం తిరగబెట్టడమే అందుకు కారణం. కన్నీళ్లతో ఫీల్డ్‌ను వీడిన తేజస్విన్ ఇప్పుడు డెకాథ్లాన్‌లో విజయం అనంతరం తన భావోద్వేగాన్ని ప్రదర్శించాడు. డెకాథ్లాన్‌లో తేజస్విన్ వరుసగా 100 మీ. (870 పాయింట్లు), లాంగ్ జంప్ (1015), షాట్‌పుట్ (673), హైజంప్ (944), 400 మీ. (837), 110 మీ. హర్డిల్స్ (922), డిస్కస్ త్రో (674), పోల్‌వాల్ట్ (702), జావెలిన్ (635), 1500 మీ.(704) చొప్పున పాయింట్లు నమోదు చేశాడు.




## రజతంతో నీరజ్ 'సమ్'తృప్తి!

గ్లాస్గో: భారత స్టార్ అథ్లెట్, జావెలియన్ నీరజ్ చోప్రా కామన్వెల్త్ క్రీడల్లో రజత పతకంతో మెరిశాడు. రెండు ఒలింపిక్ పతకాల విజేత అయిన నీరజ్ స్థాయి, అంచనాలతో పోలిస్తే రెండో స్థానం నిరాశ కలిగించేదే అయినా...సుదీర్ఘ కాలం గాయంతో బాధపడి ఇప్పుడిప్పుడే కోలుకుంటున్న తీరును చూస్తే రజతం సంతృప్తికర ఫలితంగానే చెప్పవచ్చు. క్వాలిఫయింగ్‌లో జావెలిన్ ఆశించిన విధంగా విసరలేకపోయిన నీరజ్ అసలు పోరులో సత్తా చాటాడు. తన రెండో ప్రయత్నంలో బల్లెంను 85.83 మీటర్లు విసిరిన నీరజ్ ఖాతాలో సిల్వర్ మెడల్ చేరింది. తన మొదటి ప్రయత్నంలో 80.97 మీటర్ల దూరం జావెలిన్‌ను విసిరిన నీరజ్... రెండో ప్రయత్నంలో విసిరిన దూరం పతకాన్ని అందించింది మూడు, నాలుగు ప్రయత్నాల్లో అంతకంటే మెరుగైన ప్రదర్శన ఇవ్వలేకపోయిన నీరజ్...తర్వాతి రెండు ప్రయత్నాలనూ ఫౌల్‌గా ముగించాడు. ఈ ఈవెంట్‌లో కాంస్యం కూడా భారత ఆటగాడే గెలుచుకోవడం విశేషం. యశ్వీర్ సింగ్ (85.41 మీ.) తన కెరీర్‌లో అత్యుత్తమ ప్రదర్శనతో మూడో స్థానంలో నిలిచి కాంస్యం అందుకున్నాడు. గత ఏడాది కాలంగా నిలకడగా రాణిస్తున్న శ్రీలంక జావెలిన్ త్రోయర్ రుమేశ్ తరంగ పతిరగేకు స్వర్ణ పతకం లభించింది. పతిరగే విసిరిన జావెలియన్ 89.75 మీటర్లు దూసుకుపోయింది. ఈ సీజన్‌లో తాను పాల్గొన్న ఎనిమిది ఈవెంట్లలో పతిరగే ఏడు సార్లు మొదటి స్థానంలో నిలవడం విశేషం. యశ్వీర్ తొలి ఐదు ప్రయత్నాల్లో రెండు ఫౌల్స్ సహా తడబాటుకు గురైనా...చివరి ప్రయత్నంలో నమోదు చేసిన దూరం అతనికి కాంస్యాన్ని అందించింది. 12 మంది పాల్గొన్న ఫైనల్‌లో మరో భారత ఆటగాడు రోహిత్ (81.56 మీ.)




ఏడో స్థానంతో ముగించగా... పారిస్ ఒలింపిక్స్ స్వర్ణ పతక విజేత అర్షద్ నదీమ్ (పాకిస్తాన్) 9వ స్థానానికే పరిమితమయ్యాడు. 'ఫిట్‌నెస్‌పరంగా నేను ఇంకా కోలుకునే దశలోనే ఉన్నాను. ఈ సీజన్‌లో అత్యుత్తమ ప్రదర్శన ఇచ్చినందుకు సంతృప్తిగా ఉన్నా. ఇక్కడి వాతావరణ పరిస్థితుల్లో నేను అనుకున్నట్లుగా జావెలిన్ విసరలేకపోయా. కానీ ఇలాంటి చోటా పతకం గెలవడం ఆనందాన్నిచ్చింది. ఆసియా క్రీడలకు ముందు నా ప్రదర్శనను మరింత మెరుగుపర్చుకునేందుకు అవకాశం ఉంది' అని నీరజ్ స్పందించాడు.

**తండ్రి శిక్షణలో...**

భారత జావెలిన్‌లో నీరజ్ చోప్రా శకం మొదలైన తర్వాత అతని నీడలో మరో ఆటగాడి ప్రదర్శనకు సహజంగానే గుర్తింపు లభించడం లేదు. ఇలాంటి స్థితిలో యశ్వీర్ గెలిచిన కాంస్యం విలువ ఎంతో అమూల్యం. నిజానికి 2021లో నీరజ్ ఒలింపిక్ చాంపియన్‌గా నిలవడానికి కొన్నాళ్ల క్రితం నెలకొల్పిన జూనియర్ ఫెడరేషన్ మీట్ రికార్డును బద్దలు కొట్టడంతోనే యశ్వీర్ మొదటిసారి వెలుగులోకి వచ్చాడు. అయితే ఇంత కాలానికి అతని కష్టానికి ఫలితం లభించింది. రాజస్తాన్‌కు చెందిన యశ్వీర్‌కు అతని తండ్రి, మాజీ జావెలిన్ త్రోయర్ అయిన రాయ్ సింగ్ కోచ్‌గా మారి మార్గనిర్దేశనం చేశాడు. జాతీయ స్థాయిలో, రైల్వే చాంపియన్‌షిప్‌లలో పలు పతకాలు గెలుచుకొని స్పోర్ట్ కోటాలోనే ఉద్యోగం అందుకున్న రాయ్ సింగ్ కోచింగ్‌లో కూడా ఎన్ఐఎస్ డిప్లొమా హోల్డర్. ఈ అనుభవాన్నంతా అతను తన కొడుకును తీర్చిదిద్దేందుకు ఉపయోగించాడు. తాను పెద్ద స్థాయిలో విజయాలు సాధించలేదని, యశ్వీర్ కామన్వెల్త్, ఆసియా క్రీడలవంటి ప్రతిష్టాత్మక ఈవెంట్లలో పతకాలు సాధించాలని కలగన్న రాయ్ సింగ్ అన్ని రకాలుగా శ్రమించి శిక్షణ అందించాడు. ఈవెంట్‌కు ముందు కొడుకును ప్రోత్సహిస్తూ 'జీవితంలో ఇదే అతి పెద్ద ప్రశ్నగా భావించి సరైన రీతిలో సమాధానం ఇవ్వు. ఇక్కడ పూర్తి సామర్థ్యంతో సత్తా చాటు. ఇక్కడ గెలిస్తే నీ జీవితం మారిపోతుంది. ఎంత బాగా ఆడగలవో ఆడు' అంటూ ఈవెంట్‌కు ముందు స్ఫూర్తి నింపిన తండ్రికి యశ్వీర్ పతకాన్ని కానుకగా ఇచ్చాడు.

## సౌత్ జోన్ సారథిగా తిలక్ వర్మ

బెంగళూరు: దేశవాళీ క్రికెట్ టోర్నమెంట్ దులీప్ ట్రోఫీలో పాల్గొనే సౌత్ జోన్ జట్టుకు తిలక్‌వర్మ కెప్టెన్‌గా వ్యవహరించనున్నాడు. బెంగళూరులోని బీసీసీఐ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ (సీఓఈ)లో జరగనున్న ఈ టోర్నమెంట్ కోసం సౌత్ జోన్ సెలక్టర్లు శనివారం 15 మందితో కూడిన జట్టును ప్రకటించారు. భారత టి20 జట్టుకు వైస్‌కెప్టెన్‌గా వ్యవహరిస్తున్న తిలక్ వర్మ ఈ జట్టుకు సారథిగా ఎంపిక కాగా... ఆంధ్రప్రదేశ్ సీనియర్ ప్లేయర్ రికీ భుయ్ వైస్ కెప్టెన్‌గా వ్యవహరించనున్నాడు. భారత సీనియర్ ఆటగాడు కరుణ్ నాయర్‌తో పాటు హైదరాబాద్‌కు చెందిన హిమతేజ జట్టులో చోటు దక్కించుకున్నారు. ఆంధ్రప్రదేశ్ యువ ఆటగాడు షేక్ రషీద్‌కు కూడా చోటు దక్కింది. సౌత్ జోన్ జట్టు: తిలక్ వర్మ (కెప్టెన్), రికీ భుయ్, అభినవ్, షేక్ రషీద్, హిమతేజ, స్మరణ్, జగదీషన్, కరుణ్ నాయర్, త్యాగరాజన్, శ్రేయస్ గోపాల్, సాయితేజ, విజయ్, కవెరప్ప, అమన్ ఖాన్.





# ‘ది ప్యారడైజ్’ నుంచి నాని ‘జడల్’ లుక్ రిలీజ్..
# పవర్‌ఫుల్ స్టిల్‌తో టీజర్‌పై అంచనాలు పీక్స్‌కు!

చీఖఅఱ । న్యాచురల్ స్టార్ నాని హీరోగా, యువ దర్శకుడు శ్రీకాంత్ ఓదెల తెరకెక్కిస్తున్న మోస్ట్ అవైటెడ్ పాన్ ఇండియా చిత్రం ‘ది ప్యారడైజ్’ పై రోజురోజుకూ అంచనాలు పెరుగుతున్నాయి. ‘దసరా’ వంటి బ్లాక్‌బస్టర్ తర్వాత ఈ ఇద్దరి కాంబినేషన్‌లో వస్తున్న రెండో సినిమా కావడంతో సినీ అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ప్రస్తుతం ఈ చిత్రం షూటింగ్ చివరి దశలో ఉండగా, ప్రమోషన్స్‌ను కూడా చిత్ర బృందం వేగవంతం చేసింది. తాజాగా చిత్ర బృందం నాని పోషిస్తున్న ‘జడల్’ పాత్రకు సంబంధించిన ఓ పవర్‌ఫుల్ స్టిల్‌ను విడుదల చేసింది. ఇందులో బాక్సింగ్ బ్యాగ్‌ను బలంగా పంచ్ కొడుతూ కనిపించిన నాని లుక్ అభిమానులను విపరీతంగా ఆకట్టుకుంటోంది. గుబురు జుట్టు, రఫ్ గడ్డం, ఇంటెన్స్ ఎక్స్‌ప్రెషన్‌తో నాని పూర్తిగా కొత్త అవతార్‌లో కనిపించారు. ఈ స్టిల్‌ను చూసిన అభిమానులు సోషల్ మీడియాలో భారీగా షేర్ చేస్తూ, నాని కెరీర్‌లో మరో మాస్ పాత్ర రాబోతోందని కామెంట్లు చేస్తున్నారు.ఇప్పటికే చిత్ర యూనిట్ ఆగస్టు 6న ‘ది ప్యారడైజ్’ టీజర్‌ను విడుదల చేయనున్నట్లు ప్రకటించింది. ఇప్పుడు విడుదలైన ‘జడల్’ స్టిల్‌తో టీజర్‌పై ఆసక్తి మరింత పెరిగింది. శ్రీకాంత్ ఓదెల ఈసారి కూడా తన మార్క్ రియలిస్టిక్ టేకింగ్, ఎమోషన్, మాస్ ఎలిమెంట్స్‌తో ప్రేక్షకులను అలరించబోతున్నారని సినీ వర్గాలు భావిస్తున్నాయి. ఈ చిత్రంలో యువ నటి కయాదు లోహర్ కథానాయికగా నటిస్తుండగా, కీర్తి సురేష్ ప్రత్యేక గీతంలో సందడి చేయనున్నట్లు సమాచారం. అలాగే ప్రముఖ నటులు రాఘవ్ జుయాల్, మోహన్ బాబు, సంపూర్ణేష్ బాబు కీలక పాత్రల్లో కనిపించనున్నారు. విభిన్నమైన పాత్రలతో ఈ సినిమా కథకు మరింత బలం చేకూరనుంది. ‘ది ప్యారడైజ్’ చిత్రాన్ని ఎస్ఎల్‌వీ సినిమాస్ బ్యానర్‌పై నిర్మాత సుధాకర్ చెరుకూరి అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్నారు. భారీ బడ్జెట్‌తో రూపొందుతున్న ఈ చిత్రంలో విజువల్స్, యాక్షన్ ఎపిసోడ్స్, ఎమోషనల్ డ్రామా ప్రత్యేక ఆకర్షణగా నిలవనున్నాయని సమాచారం. ‘దసరా’తో బాక్సాఫీస్ వద్ద సంచలన విజయాన్ని అందుకున్న నాని-శ్రీకాంత్ ఓదెల జోడీ, ఇప్పుడు ‘ది ప్యారడైజ్’తో మరింత భారీ విజయాన్ని లక్ష్యంగా పెట్టుకుంది. ఇప్పటికే విడుదలైన పోస్టర్లు, ప్రచార కంటెంట్ సినిమాపై భారీ బజ్‌ను తీసుకొచ్చాయి. తాజాగా విడుదలైన ‘జడల్’ స్టిల్ ఆ అంచనాలను మరో మెట్టు ఎక్కించింది.ఇప్పుడు అందరి చూపు ఆగస్టు 6న విడుదల కానున్న టీజర్‌పైనే ఉంది. ఈ టీజర్ సినిమాపై ఉన్న అంచనాలను మరింత పెంచుతుందా? నాని మరోసారి తన మాస్ అవతార్‌తో అభిమానులను మెప్పిస్తాడా? అనే ఆసక్తి సినీ వర్గాల్లో నెలకొంది. అభిమానులు మాత్రం ‘జడల్’ పాత్రతో నాని మరోసారి బాక్సాఫీస్‌ను షేక్ చేయడం ఖాయమని ధీమా వ్యక్తం చేస్తున్నారు.



# ముగ్గురు బ్యూటీస్ నాగ్ కోసం..

తెలుగు సీనియర్ హీరోల్లో నాగార్జున సరైన సక్సెస్ చూసి చాలాకాలమైంది. గతేడాది కుబేర్, కూలీ సినిమాల్లో కాస్త డిఫరెంట్ పాత్రలు చేసి ఆకట్టుకున్నాడు. ప్రస్తుతం హీరోగా 100వ మూవీ చేస్తూ బిజీగా ఉన్నాడు. ఈ మూవీ గురించి సోషల్ మీడియాలో తప్పితే అధికారికంగా ఎలాంటి అప్‌డేట్స్ రావడం లేదు. తాజాగా ఈ చిత్రంలో హీరోయిన్ల గురించి డిస్కషన్ నడుస్తోంది. ఏకంగా ముగ్గురు బ్యూటీస్ నాగ్ సరసన నటించబోతున్నారట.గతంలో నిన్నే పెళ్లాడతా లాంటి సినిమాలో కెమిస్ట్రీతో అదరగొట్టిన నాగ్-టబు.. ఈ సినిమా కోసం మళ్లీ కలుస్తున్నారట. చాన్నాళ్ల క్రితమే ఈ రూమర్ బయటకొచ్చింది. కానీ నిజమా కాదా అనేది మాత్రం క్లారిటీ రాలేదు. తాజాగా ‘సంక్రాంతికి వస్తున్నాం’ ఫేమ్ ఐశ్వర్య రాజేశ్ కూడా మరో కథానాయికగా ఎంపికైందని అంటున్నారు. వీళ్లిద్దరితో పాటు సుస్మితా భట్ అనే తమిళ బ్యూటీ కూడా ఇందులో ఉందని టాక్ వినిపిస్తోంది.తమిళ దర్శకుడు ఆర్.కార్తిక్ తీస్తున్న ఈ సినిమా లాటరీ బ్యాక్‌డ్రాప్‌లో సాగే ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌లా తీస్తున్నారని తెలుస్తోంది. వచ్చే ఏడాది సంక్రాంతి టార్గెట్‌గా థియేటర్లలోకి తీసుకురావాలని మేకర్స్ అనుకుంటున్నారట. ఈ ?స్టోరీని గట్టిగా నమ్మిన నాగ్.. తనే స్వయంగా నిర్మిస్తున్నారు కూడా. ఏదేమైనా నాగ్ సరసన ముగ్గురు హీరోయిన్లు అనే రూమర్ ఇప్పుడు సామాజిక మాధ్యమాల్లో ఆసక్తికర టాపిక్ అయిపోయింది.ఖ



# ఇప్పట్లో పెళ్లి ఆలోచన లేదు నిర్మొహమాటంగా చెప్పి సాయిపల్లవి

దక్షిణాది సినీ పరిశ్రమలో సహజ నటనతో ప్రత్యేక గుర్తింపు సంపాదించుకున్న స్టార్ హీరోయిన్ సాయి పల్లవి మరోసారి వార్తల్లో నిలిచారు. డ్యాన్స్ షోల నుంచి సినీ ప్రపంచంలోకి అడుగుపెట్టి, తన టాలెంట్‌తో టాప్ హీరోయిన్‌గా ఎదిగిన ఆమె ప్రయాణం నిజంగా స్ఫూర్తిదాయకం. చిన్నప్పటి నుంచే నాట్యం, నటనపై ఆసక్తి ఉన్నప్పటికీ చదువును ప్రాధాన్యంగా తీసుకుని మెడికల్ డిగ్రీ పూర్తి చేసిన సాయి పల్లవి, ప్రేమమ్ సినిమాలో ’మలర్ టీచర్’ పాత్రతో ప్రేక్షకులను ఆకట్టుకుంది. ఆ తర్వాత ఫిదా సినిమాతో తెలుగు ప్రేక్షకులకు మరింత దగ్గరై, తన సహజ నటన, తెలంగాణ యాసతో కుర్రకారును మెస్మరైజ్ చేసింది. దీంతో ఆమెకు ’లేడీ పవర్ స్టార్’ అనే ట్యాగ్ కూడా వచ్చింది. ప్రస్తుతం ఆమె కెరీర్ పీక్‌లో ఉంది. బాలీవుడ్‌లో జునైద్ ఖాన్ తో కలిసి ఓ సినిమాతో ఎంట్రీ ఇస్తుండగా, ప్రతిష్టాత్మక ప్రాజెక్ట్ రామాయణం లో సీత పాత్ర పోషించడం మరింత ఆసక్తిని రేకెత్తిస్తోంది. అలాగే తమిళంలో ధనుష్ సరసన కూడా ఓ భారీ చిత్రంలో నటిస్తూ బిజీగా ఉంది. ఇదిలా ఉంటే, ఇటీవల ఆమె పెళ్లిపై వస్తున్న రూమర్లకు తానే స్వయంగా ఫుల్‌స్టాప్ పెట్టింది. ఒక కార్యక్రమంలో మీడియా అడిగిన ప్రశ్నకు స్పందిస్తూ సాయి పల్లవి స్పష్టంగా తన అభిప్రాయం వెల్లడించింది. ‘ప్రస్తుతం నా పూర్తి దృష్టి కెరీర్‌పైనే ఉంది. పెళ్లి గురించి ఇప్పట్లో ఎలాంటి ఆలోచన లేదు. నేను ప్రస్తుతం సింగిల్‌గానే ఉన్నాను అని చెప్పి అందరికీ క్లారిటీ ఇచ్చింది. ఆమె పెళ్లి విషయంపై సోషల్ మీడియాలో విభిన్న స్పందనలు వ్యక్తమవుతున్నాయి. కొందరు ఫ్యాన్స్ ఆమె నిర్ణయాన్ని సమర్థిస్తుంటే, మరికొందరు మాత్రం ఆమె పెళ్లి వార్త కోసం ఎదురుచూస్తున్నారు.

# అసలే ఫ్లాపులు.. ఇప్పుడు వివాదంలో ఇరుక్కుని



ఒకప్పుడు స్టార్ డైరెక్టర్‌గా వెలుగువెలిగిన ఏఆర్ మురుగదాస్.. ఇప్పుడు కెరీర్ పరంగా పూర్తిగా డౌన్ అయిపోయాడు. చేసిన సినిమాలు చేసినట్లు అట్టర్ ఫ్లాప్ అయ్యేసరికి ఒక్కరూ కూడా ఇతడిని పట్టించుకోవట్లేదు. ఇప్పుడు ఇది చాలదన్నట్లు ఓ వివాదంలో ఇరుక్కున్నాడు. టాలీవుడ్ నిర్మాత.. తాజాగా ఫిర్యాదు చేయడంతో ఇది కాస్త వెలుగులోకి వచ్చింది. ఇంతకీ అసలు ఏమైంది?గతేడాది మురుగదాస్ నుంచి రెండు మూవీస్ వచ్చాయి. వాటిలో సల్మాన్ ఖాన్‌తో చేసిన ‘సికందర్’ ఒకటి కాగా శివకార్తికేయన్‌తో చేసిన ‘మదరాశి’ ఒకటి. ఇవి రెండు దారుణంగా ఫ్లాప్ అయ్యాయి. ‘మదరాశి’ చిత్ర నిర్మాత ఎన్వీ ప్రసాద్ ఇప్పుడు తమిళ దర్శకులు, నిర్మాతల కౌన్సిల్‌లో ఏఆర్ మురుగదాస్‌పై ఫిర్యాదు చేశారు. తొలుత రూ.115 కోట్ల బడ్జెట్ అని చెప్పి షూటింగ్ పూర్తయ్యేసరికి రూ.170 కోట్ల మేర ఖర్చు చేశాడని తన కంప్లైంట్‌లో పేర్కొన్నారు.అయితే బడ్జెట్ పెరగడానికి మురుగదాస్‌కి సరైన ప్లానింగ్ లేకపోవడం, దీనితో పాటు ‘సికందర్’ సమాంతరంగా చేయడమే ప్రధాన కారణమని పేర్కొన్నారు. తమకు జరిగిన నష్టానికిగానూ రూ.10 కోట్ల పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేసినట్లు తెలుస్తోంది. దీనిపై ఇరువర్గాల మధ్య చర్చ జరగ్గా.. అంతిమంగా కౌన్సిల్ ఓ నిర్ణయం తీసుకుంది. దీని ప్రకారం.. ఏఆర్ మురుగదాస్, తన రమణ 2(ఠాగుర్ సీక్వెల్) స్టోరీని సదరు నిర్మాణ సంస్థకు ఉచితంగా ఇచ్చేందుకు అంగీకారం తెలిపాడట. అలా ఈ వివాదానికి ఓ పరిష్కారం దొరికిందని కోలీవుడ్‌లో మాట్లాడుకుంటున్నారు. ప్రస్తుతానికైతే మురుగదాస్ చేతిలో కొత్త ప్రాజెక్ట్ ఏం లేదు. ఈ వివాదం జరిగిన తర్వాత వస్తుందా అనే నమ్మకం కూడా కలగట్లేదు!

# సింగర్ నుంచి ఐటమ్ డ్యాన్సర్‌గా..



పాటలు పాడే సింగర్స్ మహా అయితే మ్యూజిక్ డైరెక్టర్స్ అవుతారు. కొన్నిసార్లు మాత్రం ఊహించని సర్‌ప్రైజ్ ఇస్తుంటారు. లేటెస్ట్‌గా ఓ తెలుగు గాయని.. ఐటమ్ సాంగ్‌లో గ్లామరస్ డ్యాన్స్ చేసి అదరగొట్టింది. ఆమెనే జోనితా గాంధీ. తెలుగు ప్రేక్షకుల్లో కొందరికి ఈమె గురించి తెలుసు. అయితే ఈమె నుంచి అదిరిపోయే డ్యాన్స్ చూసి మాత్రం ఆశ్చర్యపోయారు. ఇంతకీ ఈమె ఎవరు? డీటైల్స్ ఏంటి?జోనితా గాంధీ ఢిల్లీలో పుట్టింది. ఈమెకు 9 నెలల వయసున్నప్పుడే కుటుంబమంతా కెనడా వెళ్లిపోయింది. తర్వాత అక్కడే సెటిలైపోయారు. దీంతో చదువంతా అక్కడే పూర్తి చేసింది. ఏడేళ్లు ఉన్నప్పుడే పాటలు పాడటం లాంటివి చేసింది. తర్వాత కొన్నేళ్లకు తన పాడిన పాటల్ని యూట్యూబ్‌లో అప్‌లోడ్ చేసేది. వాటికి మంచి రెస్పాన్స్ వస్తుండేసరికి పాడటాన్ని కెరీర్‌గా ఎంచుకోవాలని నిర్ణయించుకుంది. కొన్నాళ్లకు భారత్‌కి తిరిగొచ్చింది.జోనితాలోని ప్రతిభని గుర్తించిన బాలీవుడ్ సంగీత ద్వయం విశాల్-శేఖర్.. షారూఖ్ ఖాన్ ‘చెన్నై ఎక్స్‌ప్రెస్’ టైటిల్ సాంగ్ పాడే అవకాశం కల్పించారు. తొలి పాటే ఎస్పీ బాలసుబ్రమణ్యం లాంటి ప్రసిద్ధ గాయకుడితో కలిసి పాడేసరికి జోనితాకు ఫేమ్ వచ్చింది. తర్వాత ఏఆర్ రెహమాన్, ప్రీతమ్, అమిత్ త్రివేది తదితర సంగీత దర్శకులు కంపోజ్ చేసిన సాంగ్స్ పాడింది.అనిరుధ్‌తో కలిసి ఈమె పాడిన కావాలయ్యా, అరబిక్ కుతు లాంటి పాటలు సెన్సేషన్ సృష్టించాయి. ‘కిక్ 2’ మూవీలోని నువ్వే నువ్వే ప్రాణం పాటతో తెలుగులోకి ఎంట్రీ ఇచ్చింది. లవ్ స్టోరి, సర్కారు వారి పాట తదితర చిత్రాల్లో సాంగ్స్ పాడింది. ఓవరాల్‌గా చూస్తే తెలుగు, తమిళ, కన్నడ, బెంగాలీ, గుజరాతీ, మరాఠీ, పంజాబీ, ఉర్దూ, ఇంగ్లీష్‌లో పాటలు పాడి మెప్పించింది. ఇన్ స్టాలో 28 లక్షల ఫాలోవర్స్ ఉన్న ఈమె.. లైవ్ కన్సర్ట్స్‌తోనూ సంగీత ప్రియుల్ని ఎంటర్‌టైన్ చేస్తూనే ఉంది.ఇన్నాళ్లు సింగర్‌గా అందరికీ తెలిసిన జోనితా గాంధీ.. అడివి శేష్ ‘డకాయిట్’ కోసం తొలిసారి ఐటమ్ సాంగ్‌లో డ్యాన్స్ చేసింది. అందచందాలతో ఆశ్చర్యపరిచింది. చూస్తుంటే సింగర్‌గా ఏమో గానీ డ్యాన్సర్‌గా మాత్రం మరింత బిజీ

Printed & Published And Owned by **YAMJALA PRAVEEN**, Printed at **SRI VENKATESWARA PRINTING SOLUTIONS** 11-1/B/42, BPM Green Lands Colony, Shabari Gardens Back, Parvathapur, Medipally Mandal, Peerzadiguda, GHMC, Medchal Malkajgiri, Telangana - 500098. Published from 4-33, Near Hanuman Temple, Allapur Village, Choutuppal Mandal, Yadadri Bhuvanagiri, Telangana - 508252. **Editor : YAMJALA PRAVEEN, PRGI No: TGTEL/26/A6221,** Ph. No: 9491134365. Email id: praveenyamjala1@gmail.com, Website: www.tholivelugu.com